E KABURU - Digital News Paper
E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 11-04-2026 (వారం) శనివారం సంపుటి: 02 || సంచిక:99 || పేజీలు–6
www.ekaburu.com

## రేపు ఇంటర్ ఫలితాలు

ఒకేరోజు ఫస్ట్, సెకండియర్ రిజల్ట్స్ విడుదల



02

నియోజకవర్గాల పెంపుపై మొండిగా వెళ్తే..

## ప్రజా ఉద్యమం తప్పదు



**సీఎం రేవంత్‌రెడ్డి**

దేశవ్యాప్తంగా లోక్‌సభ సీట్లు 50% పెంచాలన్న నిర్ణయంతో ఉత్తరాదిలో అతి పెద్ద రాష్ట్రమైన యూపీ సీట్లు 80 నుంచి 120కి పెరిగితే, దక్షిణాదిలో పెద్ద రాష్ట్రమైన తమిళనాడు సీట్లు 40 నుంచి 60కి పెరుగుతాయి. అంటే ఈ రెండు రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న సీట్ల అంతరం 40 నుంచి 60కి పెరుగుతుంది. కేరళయూపీల మధ్య తేడా 60 నుంచి 90కి చేరుతుంది. ప్రస్తుతం దక్షిణాదిలో ఉన్న సీట్లు 130 నుంచి 195కి పెరిగితే ఉత్తరభారతం మొత్తం సీట్లు 600కి పైగా చేరుతాయి. ఇప్పుడు రాజకీయంగా 100% ఉన్న ఉత్తరాది రాష్ట్రాల అనుకూలత 150%కి చేరుతుంది.

- కేంద్రాన్ని హెచ్చరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య సమతౌల్యం పాటించాలని సూచన
- రాష్ట్రాల జీడీపీ ఆధారంగా సీట్లు ఇవ్వాలని డిమాండ్
- సీనియర్లను గౌరవించిన చరిత్ర భారాసకు లేదని మండిపాటు

ఈకబురు, ఢిల్లీ: దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాలను 50% పెంచాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. దానివల్ల రాష్ట్రాల మధ్య అంతరం పెరిగి సమతౌల్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం మొండిగా ముందుకెళ్తే ప్రజా ఉద్యమం వస్తుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్నట్లు మూడు సాగుచట్టాలు చేసినా రైతుల ఆందోళన కారణంగా వెనక్కు తీసుకోవాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు నియోజకవర్గాల పెంపు విషయంలోనూ అదే పరిస్థితిని ఎదుర్కోక తప్పదన్నారు. శుక్రవారం దిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన సీఎం.. ఇక్కడి తన నివాసంలో విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

మిగతా 2లో

## జీహెచ్ఎంసీలో తీవ్రమైన అవినీతికి ముఖ్యమంత్రే బాధ్యులు

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ఈ కబురు, హైదరాబాద్:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీహెచ్ఎంసీని అవినీతికి కేరాఫ్ గా మార్చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు.



04

మాదాపూర్ లో 'కామెల్ క్యూ' సాఫ్ట్‌వేర్ సంస్థ

# భారీ మోసం

ఐటీ ఉద్యోగాల పేరుతో 452 మంది నుంచి రూ. 5 కోట్లు వసూల్..
రాత్రికి రాత్రే బోర్డు తిప్పేసి..
మరో బోగస్ కంపెనీ ప్రారంభం..
ముగ్గురు నిందితుల అరెస్ట్..
పరారీలో మరో 7గురు నిందితులు





ఈ-కబురు, శేరిలింగంపల్లి

**హైదరాబాద్‌లో నిరుద్యోగుల ఆశలను ఆసరాగా చేసుకుని పలు బోగస్ సాఫ్ట్‌వేర్ కంపెనీలు భారీగా మోసాలకు పాల్పడుతున్నాయి. విదేశీ ఉద్యోగాలు, భారీ ప్యాకేజీలు, ఐటీ కొలువుల పేరుతో ఆఫర్ లెటర్లు ఇచ్చి, సెక్యూరిటీ డిపాజిట్ల రూపంలో లక్షలాది రూపాయలు వసూలు చేసి బోర్డు తిప్పేస్తున్నాయి. నిరుద్యోగులను మోసం చేయాలనే ఏకైక లక్ష్యంతో క్యామల్ క్యూ పేరుతో సాఫ్ట్‌వేర్ కంపెనీని ప్రారంభించిన ఓ ప్రబుద్ధుడు వందలమంది నిరుద్యోగుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి రాత్రికి రాత్రే బోర్డు తిప్పేశాడు. మరి కొంతమందితో కలిసి మరో కొత్త బోగస్ కంపెనీని ప్రారంభించి నిరుద్యోగులను మోసం చేసేందుకు పథకం వేసాడు. చివరికి పోలీసుల చేతికి చిక్కి కటకటాల పాలయ్యారు. ట్రైనింగ్ ఇచ్చి ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి 452 మంది నిరుద్యోగుల నుండి 5కోట్ల వరకు వసూళు చేసి బోర్డు తిప్పేసిన కామెల్‌క్యూ కంపెనీ సీఈఓ, అపరేషన్స్ హెడ్, హెచ్ఆర్ మేనేజర్‌లను మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరో ఏడుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..**



పోలీసులు అరెస్టు చేసిన కామెల్ క్యూ సంస్థ నిర్వాహకులు

### ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు నిరుద్యోగులకు ఎర...

జనగాంకు చెందిన ఎరుకల మహేష్(32) 2019 నుండి 2024 వరకు పలు ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు చేశాడు. జల్సాలు, లావిష్ లైఫ్ కోసం జీతం సరిపోక ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు మహేష కంపెనీ ప్రారంభించి, ఉద్యోగాల పేరుతో నిరుద్యోగల నుండి డబ్బులు వసూలు చేయాలని డిసైడ్ అయ్యాడు. దీంతో 2024 ఆగస్టులో కేపిహెచ్‌బీలోని మంజీరా ట్రినిటీ బిల్డింగ్ నాల్గవ అంతస్తులో కామెల్‌క్యూ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ ప్రారంభించాడు.


మిగతా 2లో



6

### రాజస్తాన్ రాయల్స్ వరుసగా నాలుగో విజయం

విజయలక్ష్యం ఎంతైతేనేమి... ప్రత్యర్థి ఎవరైతేనేమి... 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి లెక్కే లేదు... అతనికి తెలిసిందల్లా ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడటమే... ఐపీఎల్‌లో మరోసారి అతను తన విధ్వంసక రూపాన్ని ప్రదర్శించాడు. ఫలితంగా రాజస్తాన్ రాయల్‌స్‌కు వరుసగా నాలుగో విజయం దక్కగా, బెంగళూరుకు తొలి ఓటమి ఎదురైంది. 202 పరుగుల ఛేదనలో వైభవ్ 78 పరుగుల సహాయంతో 49 బంతుల్లోనే 129కి చేరిన రాజస్తాన్‌కు మిగిలిన 73 పరుగులు రాబట్టడంలో ఇబ్బంది రాలేదు. ధ్రువ్ జురేల్ కూడా అర్ధ సెంచరీతో విజయంలో కీలకపాత్ర పోషించాడు.



### బెంగాల్‌లో 6నెలల్లో ఉమ్మడి పౌరస్మృతి

మహిళలకు, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు

ఎన్నికల మ్యానిఫెస్టోలో భాజపా కీలక హామీలు

02

మావోయిస్టు రహిత రాష్ట్రంగా

## తెలంగాణ: డీజీపీ



- రాష్ట్ర కమిటీలో మిగిలిన 11 మంది జనజీవన స్రవంతిలోకి వచ్చారన్న శివధర్‌రెడ్డి
- తెలంగాణకు చెందిన గణపతి సహా మరో ఐదుగురు అజ్ఞాతంలో ఉన్నారని వెల్లడి
- డీజీపీ సమక్షంలో 36 ఆయుధాలతో సహా లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు


04

## ప్రపంచ సాంకేతిక పటంలో ఏపీకి నవశకం

- క్వాంటం డీప్ టెక్ లో అజేయ శక్తిగా అమరావతి
- ఏప్రిల్ 14 తేదీన ప్రారంభం క్వాంటం టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీ
- మేధాటవర్స్, ఎస్ఆర్ఎం నుంచి పనిచేయనున్న 1ఎస్, 1క్యూ క్వాంటం టెస్ట్ బెడ్స్

ఈ కబురు, అమరావతి :

నవశకం సాంకేతికత క్వాంటం టెక్నాలజీలో గ్లోబల్ లీడర్ గా అమరావతి ఎదుగుతోంది. నేషనల్ క్వాంటం మిషన్ లక్ష్యాలను అందిపుచ్చుకుని దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రంగా రూపు దిద్దుకుంటోంది.



04

అన్నా..

## దేవుడే పంపిండు!



- కేసీఆర్ వద్ద మాజీమంత్రి జీవన్‌రెడ్డి భావోద్వేగం
- ఎర్రవల్లిలో బీఆర్ఎస్ అధినేతతో భేటీ..స్వాగతం పలికిన కేటీఆర్, పార్టీ నేతలు
- జీవన్‌రెడ్డిని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్న కేసీఆర్
- పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్న నేతలు..రాజకీయ పరిస్థితులపై చర్చ
- పార్టీలో అత్యంత ప్రాధాన్యం ఉంటుందని హామీ ఇచ్చిన మాజీ సీఎం
- 20న జగిత్యాలలో కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోనున్న జీవన్‌రెడ్డి

ఈకబురు, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాల విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 12న ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు రెండూ విడుదల చేసేందుకు బోర్డు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలు కలిపి 1,495 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. అలాగే 5 పరీక్ష కేంద్రాలు పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 4,89,126 మందికి, రెండో సంవత్సరం విద్యార్థులు 5,07,949 మందికి హాల్ టికెట్లు జారీ అయ్యాయి. మార్చి 18న పరీక్షలు పూర్తి కావడానికి ముందే మూల్యాంకనం మొదలైంది. దీంతో ఆ నెలాఖరుకే ఫలితాలు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈనెల మొదటి వారంలోనే ఫలితాలు వెల్లడిస్తామని అధికారులు మొదట్లో ప్రకటించినప్పటికీ అనివార్య కారణాలతో ఆలస్యం జరిగినట్లు తెలుస్తోంది.

హైదరాబాద్: 'తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీ దగ్గరికి పంపించిండు. అన్నా.. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్లకైనా మీతో కలిసి పనిచేసే అవకాశం రావడం సంతోషంగా వుంది..' అని ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నేత, మాజీమంత్రి టి.జీవన్‌రెడ్డి.

మిగతా 2లో





### 52.8 శాతానికి చేరిన ఆర్టీసీ ఉద్యోగుల కరువు భత్యం

ఈ ఏడాది తొలి విడత బకాయి 2.1 శాతం ప్రకటన

03



## చర్చలపై ప్రతిష్టంభన!

రెండు వర్గాలుగా విడిపోయిన ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులు
నేడు ఇస్లామాబాద్ చర్చలకు వెళ్లాల్సిందేనంటున్న ఒక వర్గం
లెబనాన్‌పై దాడులు ఆపితేనే చర్చలంటున్న మరో వర్గం
పాకిస్తాన్‌కు బయలుదేరిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్
ఇరుపక్షాలను స్వాగతించడానికి సిద్ధమైన పాక్ సర్కార్

02

ఈకబురు,ఇస్లామాబాద్: పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించి, శాంతిని సాధించడమే ధ్యేయంగా శనివారం పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరగాల్సిన చర్చలపై ప్రతిష్టంభన నెలకొంది. చర్చల విషయంలో ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గతంగా విభేదాలు తలెత్తినట్లు సమాచారం. ఇరాన్ ప్రతినిధులు రెండు వర్గాలుగా విడిపోయారు. తమ వాదన నుంచి వెనక్కి తగ్గడం లేదు. శాంతి చర్చలకు తప్పనిసరిగా హాజరు కావాలని ఒకవర్గం పట్టుబడుతుండగా, మరో వర్గం అందుకు ససేమిరా ఒప్పుకోవడం లేదు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఆపితేనే చర్చలంటూ మెలిక పెడుతోంది.

## నియోజకవర్గాల పెంపుపై మొండిగా వెళ్తే..

# ప్రజా ఉద్యమం తప్పదు



శుక్రవారం దిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన సీఎం.. ఇక్కడి తన నివాసంలో విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

''గతంలో వాజ్‌పేయీ ప్రభుత్వం ఒక్క ఓటుతో ఓడిపోయింది. భవిష్యత్తులో అలాంటి పరిస్థితి రాకుండా చూసుకోవడానికి భాజపా.. ఉత్తరాది రాష్ట్రాల బలం పెంచే పనిలో ఉంది.

కేంద్ర ప్రభుత్వం అన్ని పక్షాలతో చర్చించి అభిప్రాయాలు స్వీకరించకుండా మొండిగా ముందుకెళ్తే ప్రజా ఉద్యమం వస్తుంది. ప్రస్తుతం విద్య, ఉద్యోగ నియమకాలు 50% మెరిట్, 50% రిజర్వేషన్ల ప్రాతిపదికగా జరుగుతున్నాయి. సీట్ల పెంపు కూడా అలా ఆర్థిక, సామాజిక, రాజకీయ కోణాల్లో జరగాలి. కాదని గుడ్డిగా పెంచితే పెద్దరాష్ట్రాలు పెద్దగా, చిన్న రాష్ట్రాలు మరింత చిన్నవిగా అయిపోతాయి. వివక్ష మరింత పెరిగిపోతుంది. ఇది కేవలం దక్షిణాది రాష్ట్రాల సమస్య మాత్రమే కాదు. ఉత్తరాదిలోనూ పంజాబ్, హరియాణా, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ లాంటి రాష్ట్రాలూ నష్టపోతాయి. అవి కూడా ఈ పెంపును ఒప్పుకొనే పరిస్థితి ఉండదు. ఇవేవీ పట్టించుకోకుండా ముందుకెళ్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

ఆర్థిక వనరుల పంపకాల్లో ఉత్తర, దక్షిణాదిల మధ్య అంతరాన్ని ఇప్పుడు రాజకీయంగానూ తీసుకురావడానికి భాజపా ప్రయత్నిస్తోంది. కేంద్ర పన్నుల్లో దక్షిణాది రాష్ట్రాలన్నింటికీ కలిపి పంచే మొత్తం కంటే ఒక్క ఉత్తర్‌ప్రదేశ్‌కి పంచే మొత్తమే అధికం. సీట్లు పెంచితే ఆ రాష్ట్రం రాజకీయంగానూ మరింత బలోపేతమవుతుంది. దేశానికి వెన్నెముకగా ఉన్న దక్షిణ, పశ్చిమ రాష్ట్రాలు, 40% ఆర్థిక వనరులు అందిస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు కనీసం 40% సీట్లయినా కేటాయించాలి. మోదీ అధికారంలోకి వచ్చిన గత 12 ఏళ్ల నుంచి రాజకీయంగా దక్షిణాదికి ప్రాధాన్యం లభించడంలేదు. ఇదివరకు కేంద్రంలోని టాప్10 మంత్రి పదవుల్లో కనీసం నాలుగు దక్షిణాదికి ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ఎన్ని ప్రాధాన్య పదవులు ఇచ్చారో చెప్పమనండి. భాజపా ఎప్పుడూ దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి కోరుకోదు. ద్రవిడ, ఆర్య సంస్కృతుల మధ్య తేడాను అలాగే కొనసాగించాలని చూస్తుంది.

సీట్ల పెంపు ఏకపక్షంగా అమలైతే దక్షిణాది రాష్ట్రాలతో సంబంధం లేకుండా దిల్లీలో ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తారు. కేవలం ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, రాజస్థాన్ రాష్ట్రాలే శాసిస్తాయి. ఆ బాధ నుంచి పుట్టుకొచ్చే ప్రజా ఉద్యమం గాయపడ్డ బెబ్బులి గర్జనలా ఉంటుంది.

ఆర్థిక ప్రాతిపదిక మేలు

రాష్ట్రాల జీడీపీ, ఆర్థిక ప్రాతిపదిక ఆధారంగా సీట్ల సంఖ్య నిర్ణయించడం మేలు. ఆర్థికంగా బలమైన రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు ఇవ్వాలి. దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాన్ని సీడబ్ల్యూసీ సమావేశంలో వివరించాను. పునర్విభజన అంశంపై కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి నేతలతో చర్చించి నిర్ణయం తీసుకుంటుంది.

మహిళా రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్‌కు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ ఆ ముసుగులో కేంద్రం రాజకీయ ప్రయోజనాలు పొందాలనుకుంటోంది. చిత్తశుద్ధి ఉంటే ఇప్పుడున్న 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయొచ్చు కదా? పెంచే సీట్లన్నీ మహిళలకే అని ప్రచారం చేస్తూ.. దాన్ని 33%కే పరిమితం చేస్తున్నారు. కేంద్రం వేస్తున్న లెక్కలు ఇంకా ప్రజల్లోకి వెళ్లలేదు. అవి అర్థమైన రోజు ప్రజల్లో తిరుగుబాటు వస్తుంది.

కొత్త జనాభా లెక్కల తర్వాతే నియోజకవర్గాల పునర్విభజన చేయొచ్చు కదా? రాష్ట్రం యూనిట్‌గానే జనాభా లెక్కల సేకరణ జరుగుతుంది. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీతో ఆరు నెలల్లో ప్రతి రాష్ట్రంలో జనాభా లెక్కల సేకరణ పూర్తి చేయొచ్చు. ఇప్పుడు దేశవ్యాప్తంగా చేపడుతున్న జనాభా లెక్కల సేకరణ వచ్చే ఏడాది డిసెంబరుకల్లా పూర్తవుతుంది. అప్పటివరకు ఆగలేనంత ఒత్తిడి భాజపాపై ఏమొచ్చిందో తెలియడంలేదు.

రాహుల్‌గాంధీ హైదరాబాద్‌లో గద్దర్‌ని కలిశారని అమిత్‌షా పార్లమెంటు సాక్షిగా చెప్పారు. కానీ అదే గద్దర్ తెలంగాణ కోసం భాజపా రాష్ట్ర కార్యాలయానికీ వెళ్లారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కూడా కలిశారు. దానికి అమిత్‌షా ఏం చెబుతారు? అది తెలియక ఆయన విమర్శలు చేశారేమో?'' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

భారాస నుంచి వెళ్లగొట్టిన వారి సంగతేంటి కేటీఆర్?

జీవన్‌రెడ్డికి కాంగ్రెస్‌లో అన్యాయం జరిగిందని కేటీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ''మరి కేసీఆర్ పార్టీలో ఈటల రాజేందర్, ఆలె నరేంద్ర, దేశిని చినమల్లయ్య, విజయశాంతిలకు జరిగిందేంటి? నాడు జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావులు ఓడిపోతే వారివైపు కూడా చూడకుండా.. గెలిచిన వారిని కేసీఆర్ పార్టీలో చేర్చుకున్నారు. సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, కందాల ఉపేందర్‌రెడ్డి సహా పలువురిని పక్క పార్టీ నుంచి గెలిచిన తర్వాత చేర్చుకున్నారు. వీరి చేతిలో ఓడిపోయిన భారాస నేతలను కనీసం పట్టించుకోలేదు. పొన్నాల లక్ష్మయ్యను పార్టీలో చేర్చుకున్న రోజు కేటీఆర్ మాట్లాడిన మాటలు అందరూ మర్చిపోయారేమో. ఇప్పుడు పొన్నాల ఎక్కడున్నారో ఎవరికైనా తెలుసా? తన వెనుక ఇంత చరిత్ర పెట్టుకొని కేటీఆర్ సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు'' అని అన్నారు.

# రేపు ఇంటర్ ఫలితాలు


ఈకబురు, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాల విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 12న ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు రెండూ విడుదల చేసేందుకు బోర్డు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలు కలిపి 1,495 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు.

అలాగే 5 పరీక్ష కేంద్రాలు పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 4,89,126 మందికి, రెండో సంవత్సరం విద్యార్థులు 5,07,949 మందికి హాల్ టికెట్లు జారీ అయ్యాయి. మార్చి 18న పరీక్షలు పూర్తి కావడానికి ముందే మూల్యాంకనం మొదలైంది. దీంతో ఆ నెలాఖరుకే ఫలితాలు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈనెల మొదటి వారంలోనే ఫలితాలు వెల్లడిస్తామని అధికారులు మొదట్లో ప్రకటించినప్పటికీ అనివార్య కారణాలతో ఆలస్యం జరిగినట్లు తెలుస్తోంది.

## బెంగాల్‌లో 6నెలల్లో

# ఉమ్మడి పౌరస్మృతి

ఈ కబురు, కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోపు ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. అక్రమ చొరబాట్లపై ఉక్కుపాదం మోపుతామని హామీ ఇచ్చారు. ఈసారి భాజపా పూర్తి మెజారిటీ సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బెంగాల్ బిడ్డను ముఖ్యమంత్రిని చేస్తామని, రాష్ట్రంలో రామరాజ్యం స్థాపిస్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అమిత్ షా శుక్రవారం కోల్‌కతాలో భాజపా మ్యానిఫెస్టోను ఆవిష్కరించారు. రాష్ట్రంలోని ప్రతి మహిళకూ నెలకు రూ.3వేల ఆర్థిక సాయం, నిరుద్యోగ యువతకు ఉద్యోగం వచ్చేవరకూ నెలకు రూ.3వేల భృతి, అయిదేళ్లలో కోటి మందికి ఉపాధి అవకాశాల కల్పన, మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాలన్నింటిలో 33 శాతం రిజర్వేషన్ తదితర కీలక హామీలను భాజపా మ్యానిఫెస్టోలో ప్రకటించింది.



భాజపా ప్రధాన హామీలు

ఆరు నెలల్లో ఉమ్మడి పౌరస్మృతి ప్రవేశపెడుతూ చట్టం తీసుకురావడం.

చొరబాట్లు, పశువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు.

మహిళలకు, నిరుద్యోగ యువతకు ప్రతి నెలా రూ 3 వేలు.

దుర్గా సురక్షా స్క్వాడ్ పేరుతో ప్రత్యేక మహిళా పోలీస్ బెటాలియన్.

ప్రభుత్వ ఉద్యోగాలన్నిటిలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్.

ఐదేళ్లలో కోటి మందికి ఉపాధి కల్పన.

బెంగాల్‌ను పారిశ్రామిక కేంద్రంగా, చేపల ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దడం.

వందే మాతరం మ్యూజియం ఏర్పాటు.

# మాదాపూర్ లో 'కామెల్ క్యూ' సాఫ్ట్‌వేర్ సంస్థ భారీ మోసం



కామెల్ క్యూ సీఈఓ మహేష్, అపరేషన్స్ హెడ్ నజీర్ బాషా



మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో కామెల్ క్యూ నిర్వాహకులు

నాటి తెలంగాణ రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో అట్టహాసంగా కంపెనీని ప్రారంభించాడు. ఈ కంపెనీలో గుంటూరుకు చెందిన ఉదయ లక్ష్మి(24)ని హెచ్ ఆర్ రిక్రూటర్‌గా, షరీఫ్ ను బ్రాంచ్ హెడ్‌గా నియమించాడు. అదే సంవత్సరం ఆక్టోబర్‌లో మాదాపూర్‌లో మరో బ్రాంచ్ ప్రారంభించి రాంబాబును బ్రాంచ్ హెడ్‌గా నియమించాడు. మాదాపూర్ అయ్యప్పసొసైటీలో మూడో బ్రాంచ్‌ను ప్రారంభించాడు. ఈ మూడు బ్రాంచులకు మహేష్ సీఈఓగా వ్యవహరిస్తూ షేక్ నజీర్ బాషా, శ్రీకాంత్ రెడ్డి, మహిత, ఝాన్సీ, ప్రభాకర్, అబ్దుల్‌రహీంలను ఉద్యోగులుగా నియమించుకున్నాడు.

ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి కోట్లు వసూలు...

తన కంపెనీ ద్వారా నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ఒక్కో నిరుద్యోగి నుండి రూ. 80వేల నుండి రూ. 1.80 లక్షల వరకు వసూళ్లు చేశాడు. కొందరి వద్ద లక్ష నుండి 3 లక్షల వరకు కూడా వసూళు చేశాడు. వసూలు చేసిన డబ్బులో రూ. 80వేలు కంపెనీకి చెందిన బ్యాంకు అకౌంట్‌లో డిపాజిట్ చేయించి మిగిలిన డబ్బులో కొంత కంపెనీ ఉద్యోగులకు కమీషన్లు ఇచ్చాడు. ఈ విదంగా దాదాపు 452 మంది నుండి రూ. 5కోట్ల వరకు వసూళు చేశాడు. మొదట్లో కొంత మంది ఉద్యోగులకు జీతాలు చెల్లించి ఆ తర్వాత చెల్లించడం మానేశాడు. వీరి మోసం గమనించి నిలదీసిన ఉద్యోగుల మీద బెదిరింపులకు పాల్పడ్డారు.

కామెల్‌క్యూ బోర్డు తిప్పేసి... మరో బోగస్ కంపెనీ ప్రారంభించి...

కాగా క్యామల్ క్యూ బారిన పడి మోసపోయిన నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోవడంతో ఈ కంపెనీ పేరుతో తన మోసాలు ఎక్కువ రోజులు సాగవని గ్రహించిన మహేష్ "ఎంయూ సాఫ్టెక్ సొల్యూషన్ అనే పేరుతో మరో కంపెనీ ప్రారంభించాడు. కామెల్‌క్యూ బ్రాంచ్‌లను ఒక్కొక్కటిగా మూసివేస్తూ వచ్చి చివరికి రాత్రికి రాత్రే బోర్డు తిప్పేశాడు. ఇక్కడి బ్రాంచ్ హెడ్, రిక్రూటర్లు, హెచ్‌ఆర్ లను నూతన కంపెనీ ఎంయూ సాఫ్టెక్ సొల్యూషన్ లో నియమించుకొని మరోసారి నిరుద్యోగులను మోసం చేసేందుకు పథకం వేశాడు. కాగా మోసపోయిన నిరుద్యోగుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కంపెనీ సీఈఓ మహేష్, హెచ్‌ఆర్ రిక్రూటర్ ఉదయ లక్ష్మీ, అపరేషన్స్ హెడ్ నజీర్ బాషాలను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుండి ఒక కారు, స్కూటీ, సెల్‌ఫోన్, పలు బ్యాంకులకు చెందిన పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లు, విజిటింగ్ కార్డులు, కంపెనీకి చెందిన రబ్బరు స్టాంపులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ఏడుగురి కోసం గాలింపు చేపట్టారు. కాగా వీరి బారిన పడిన నిరుద్యోగుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తుంది.

# బీజేపీతోనే హైదరాబాద్ నగర సమగ్ర అభివృద్ధి : ముత్తోజు అమని



బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ తో ముత్తోజు ఆమని



ముఖ్య నాయకుల సమావేశంలో శేరిలింగంపల్లి మహిళా నాయకులతో ముత్తోజు ఆమని

**మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కేంద్ర ప్రభుత్వం...**

ఈకబురు, శేరిలింగంపల్లి : భారతీయ జనతా పార్టీతోనే హైదరాబాద్ నగర సమగ్ర అభివృద్ధి సాధ్యమని ప్రజలు గుర్తిస్తున్నారని, రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో బిజెపి అఖండ విజయం సాధించడం ఖాయమని అంజయ్య నగర్ డివిజన్ బిజెపి నాయకురాలు ముత్తోజు ఆమని అన్నారు. గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని మజీద్ బండలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం. రవి కుమార్ యాదవ్ నేతృత్వంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ముత్తోజు ఆమని పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమని మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బిజెపి పార్టీ అత్యంత బలంగా ఉందని, రాబోయే రోజుల్లో ఏ ఎన్నిక జరిగినా బిజెపి అభ్యర్థులు అఖండ విజయం సాధించడం ఖాయమన్నారు. హైదరాబాద్ నగర సమగ్ర అభివృద్ధి కేవలం బిజెపితోనే సాధ్యమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలు నగర అభివృద్ధిని గాలికి వదిలేశాయన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ముఖ్యంగా జిహెచ్ఎంసి ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులు అఖండ విజయం సాధించడం ఖాయమన్నారు. అంజయ్య నగర్ డివిజన్ హైటెక్ సిటీ చెంతనే ఉన్నా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. నేటికీ ఇక్కడ కనీస వసతులు లేక బస్తీలు, కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంజయ్య నగర్ డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి ఇంచార్జి రవి కుమార్ యాదవ్, సీనియర్ నాయకుల అండదండలతో అంజయ్య నగర్ డివిజన్ అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతానని తెలిపారు.

# అన్నా.. దేవుడే పంపిండు!



. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావుతో అన్నారు. బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు గురువారం ప్రకటించిన జీవన్‌రెడ్డి శుక్రవారం ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌తో భేటీ అయ్యారు.

తొలుత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుష్పగుచ్ఛం ఇచ్చి జీవన్‌రెడ్డికి స్వాగతం పలికారు. మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే డా.కె.సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కె.విద్యాసాగర్‌రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. జీవన్‌రెడ్డి వెంట ఆయన కుమారులు రామచంద్రారెడ్డి, బాలకృష్ణారెడ్డి, చంద్రకృష్ణారెడ్డితో పాటు జగిత్యాల మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావా వసంత సురేశ్ కూడా ఎర్రవల్లికి వచ్చారు.

కాగా జీవన్‌రెడ్డిని ఆత్మీయ ఆలింగనం చేసుకున్న కేసీఆర్.. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి తన నివాసంలోకి ఆహ్వానించారు. ఈ సమయంలోనే జీవన్‌రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ నేతల సమక్షంలో ఇష్టాగోష్ఠి అనంతరం జీవన్‌రెడ్డి బృందానికి కేసీఆర్ ఆతిథ్యం ఇచ్చారు. అనంతరం కేసీఆర్, జీవన్‌రెడ్డి నడుమ సుదీర్ఘ చర్చ జరిగింది. బీఆర్ఎస్‌లో జీవన్‌రెడ్డి చేరికకు తేదీ ఖరారైంది.

రాజకీయ పరిస్థితులపై చర్చ

రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులపై కేసీఆర్, జీవన్‌రెడ్డి చర్చించుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. సుమారు 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎదురైన అనుభవాలను గుర్తు చేసుకోవడంతో పాటు, పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నట్లు తెలిసింది. తెలంగాణ ఉద్యమం, పదేళ్ల బీఆర్ఎస్ పాలన వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి పాలనా తీరు తదితరాలపై చర్చ జరిగినట్లు తెలిసింది. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి ప్రస్తుతం తిరోగమన దిశలో ఉందనే కోణంలో సుదీర్ఘ చర్చ జరిగినట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యంతో తెలంగాణకు నష్టం జరుగుతోందని ఇరువురు నేతలు అభిప్రాయపడినట్టు తెలుస్తోంది.

జగిత్యాలలో 2 లక్షల మందితో సభ

జీవన్‌రెడ్డి ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలకు జగిత్యాలలో జరిగే బహిరంగ సభ వేదికగా కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోనున్నారు. బహిరంగ సభ నిర్వహణకు అవసరమైన సన్నాహాలు ప్రారంభించాల్సిందిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన నేతలకు ఆదేశాలు అందాయి. సభ నిర్వహణ బాధ్యతను మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో పాటు స్థానిక నేతలకు అప్పగించినట్లు సమాచారం. సభ నిర్వహణకు అనువైన ప్రదేశాన్ని శనివారం బీఆర్ఎస్ నేతలు సందర్శించి ఖరారు చేయనున్నారు. సుమారు 2 లక్షల మందితో సభ నిర్వహించేలా మైదానం ఎంపిక చేయాలని కేసీఆర్ ఆదేశించినట్లు సమాచారం.

జీవన్‌రెడ్డికి సెక్రటరీ జనరల్ హోదా

జీవన్‌రెడ్డికి బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ పదవి ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిసింది. గతంలో రాజ్యసభ మాజీ సభ్యుడు కె.కేశవరావు ఈ పదవిలో కొనసాగారు. కాగా జీవన్‌రెడ్డికి ఉన్న రాజకీయ అనుభవం, సీనియారిటీని దృష్టిలో పెట్టుకుని ఆయనకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలనే యోచనలో కేసీఆర్ ఉన్నట్లు సమాచారం. ముఖాముఖి సమావేశం సందర్భంగా పార్టీలో అత్యంత ప్రాధాన్యత ఉంటుందని జీవన్‌రెడ్డికి కేసీఆర్ హామీ ఇచ్చినట్లు తెలిసింది.

**కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణపై పట్టు కోల్పోయింది**

**కేసీఆర్ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు**

**మీడియాతో జీవన్‌రెడ్డి**

సాక్షి, సిద్దిపేట: తెలంగాణపై కాంగ్రెస్ అధిష్టానం పట్టు కోల్పోయిందని మాజీమంత్రి టి.జీవన్‌రెడ్డి విమర్శించారు. అయితే తన విషయంలో పీసీసీ తప్పు చేసింది కానీ ఏఐసీసీని నిందించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు తిరోగమనంలో పయనిస్తోందన్నారు. శుక్రవారం కేసీఆర్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఒకప్పుడు పీసీసీ ఏది చెబితే ముఖ్యమంత్రులు అది చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కడే ఏకపక్షంగా, రూలర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం పీసీసీ అనేది కేవలం సీఎం అదేశాలను అమలు చేసే ఒక విభాగంగా మారిపోయింది. మరోవైపు రేవంత్‌రెడ్డి పాలనతో ప్రజలు విసిగిపోయారు. మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని బలంగా కోరుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదు. ఈ విషయంలో ప్రజల పక్షాన పోరాడేందుకు బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నా..' అని జీవన్‌రెడ్డి తెలిపారు. తనకు 14 సార్లు బీ ఫామ్ ఇచ్చారంటే కంటెంట్ ఉన్న నాయకుడినే కాబట్టే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని ఆయన అన్నారు. కాగా జీవన్‌రెడ్డి ఈ నెల 20న బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణలు మీడియాకు తెలిపారు.

# చర్చలపై ప్రతిష్టంభన!

మొత్తానికి శాంతి చర్చలకు ఇరాన్ హాజరవుతుందా? లేదా? అనేది అనుమానంగానే మారింది. శుక్రవారం రాత్రి వరకూ ఎటూ తేల్చుకోకపోవడం గమనార్హం. మరోవైపు చర్చలకు అమెరికా సిద్ధమవుతోంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ శుక్రవారం ఇస్లామాబాద్‌కు బయలుదేరారు. చర్చలు సానుకూలంగా, ఫలప్రదంగా జరుగుతాయని ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. శాంతి చర్చల పట్ల ఇరానియన్లకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే స్నేహహస్తం అందిస్తామని తెలిపారు. ఒకవేళ వారు తమతో ఆడుకోవాలని చూస్తే తదుపరి పరిణామాలు మరోలా ఉంటాయని తమ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించినట్లు పేర్కొన్నారు. చర్చల విషయంలో ట్రంప్ కొన్ని స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారని వాన్స్ వెల్లడించారు.

రెండు అంశాలు పరిష్కారమైతేనే...

ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న శాంతి చర్చల నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నగరంలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. 10 వేల మందికిపైగా భద్రతా సిబ్బంది మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బహుళ అంచెల రక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేశారు. ఈ చర్చలను పాక్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. అయితే, ఇరాన్ ప్రతినిధి బృందం రాకపై అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదు.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఆగకపోతే ఇస్లామాబాద్ చర్చల నుంచి పూర్తిగా వైదొలుగుతామని టెహ్రాన్ హెచ్చరించినట్లు ఇరాన్ అధికారిక తస్నిమ్ వార్తా సంస్థ వెల్లడించింది. పరస్పరం అంగీకరించిన రెండు అంశాలు ఇప్పటికీ అమలు కాలేదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘెర్ ఘలిబాఫ్ శుక్రవారం విమర్శించారు. లెబనాన్‌లో కాల్పుల విరమణ పాటించడం లేదని, ఇరాన్‌కు సంబంధించిన కొన్ని ఆస్తులను ఇప్పటికీ విడుదల చేయలేదని తప్పుపట్టారు.

శాంతి చర్చలు ప్రారంభం కావాలంటే ఈ రెండు అంశాలు అమల్లోకి రావాల్సిందేనని తేల్చిచెప్పారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. ఇరాన్ నుంచి పది మందితో కూడిన ప్రతినిధి బృందం చర్చలకు రాబోతోందని పాకిస్తాన్‌లోని ఇరాన్ రాయబారి రెజా అమీర్ మొఘదామ్ గురువారం నిర్ధారించారు. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉండడం గమనార్హం. అయితే, ఇరాన్ ప్రతినిధి బృందం రాకను ఉద్దేశపూర్వకంగానే రహస్యంగా ఉంచారని, వారి కోసం పాక్ ప్రభుత్వం ప్రత్యేకంగా సెక్యూరిటీ కారిడార్‌ను ఏర్పాటు చేసిందని సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది.

**దాడులు జరుగుతుండగానే చర్చలా?**

లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగించడం ప్రాథమిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమే అవుతుందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ స్పష్టంచేశారు. ఒకవైపు దాడులు కొనసాగుతుండగానే మరోవైపు చర్చలు జరపడం అర్థం పర్థం లేని పని అంటూ తేల్చేశారు. ఇదిలా ఉండగా, ఇస్లామాబాద్‌లో చర్చలకు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఇరుపక్షాలను స్వాగతించడానికి పాక్ సర్కార్ సిద్ధమయ్యింది. చర్చల కోసం వచ్చే ప్రతినిధులకు, విలేకరులకు 'వీసా ఆన్ అరైవల్'కింద వీసాలు ఇవ్వనున్నట్లు పాక్ ఉప ప్రధానమంత్రి ఇషాఖ్ దార్ శుక్రవారం తెలిపారు.

పాక్ మంత్రికి మునీర్ మందలింపు

మానవాళికి శాపం ఇజ్రాయెల్, అదొక దయ్యం, క్యాన్సర్ అంటూ దూషించిన పాక్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా అసిఫ్‌ను ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ తీవ్రంగా మందలించారు. ఆయనపై పెద్ద ఎత్తున కేకలు వేసినట్లు తెలిసింది. బాధ్యత లేకుండా వ్యవహరించడం ఏమిటని మండిపడినట్లు సమాచారం. ఇజ్రాయెల్‌ను దూషిస్తూ సోషల్ మీడియాలో చేసిన పోస్టును ఖవాజా అసిఫ్ తర్వాత తొలగించారు.



## ఘనంగా గీతం కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ

# గ్రాడ్యుయేషన్ డే

### చీఫ్ గెస్ట్‌గా హాజరైన నీతి అయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న నీతి అయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్, గీతం ప్రెసిడెంట్ శ్రీభరత్




పట్టాలు అందుకున్న గీతం కౌటిల్యా విద్యార్థులతో అమితాబ్ కాంత్, గీతం ప్రతినిధులు

**ఈ–కబురు, పటాన్‌చెరు :**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలోని గీతం డీమ్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌లోని కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ నాలుగవ గ్రాడ్యుయేషన్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నీతి అయోగ్ మాజీ సీఈఓ, భారతదేశపు జీ-20 షెర్పా అమితాబ్ కాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంత్ చేతుల మీదుగా 35 మందికి పట్టాలు, నలుగురికి బంగారు పతకాలు ప్రదానం చేశారు. అకాడమిక్ ప్రొసెషన్‌తో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో కాంత్ తన ఆతిథ్య ఉపన్యాసం చేసిన ఆయన నూతన ఆవిష్కరణలు, సమగ్రత, దేశ నిర్మాణానికి ప్రాధాన్యత నిస్తూ, ప్రజా విధానం, పరిపాలనకు అర్థవంతంగా దోహదపడాలని పట్టభద్రులైన విద్యార్థులను ప్రేరేపించారు. క్షేత్రస్థాయి పరిపాలన ప్రాముఖ్యతను హైలైట్ చేస్తూ, భారతదేశ సమాఖ్య నిర్మాణంలో కీలకమైన రాష్ట్రాలు, జిల్లాలతో మమేకమవ్వాలని అమితాబ్ కాంత్ విద్యార్థులను కోరారు. తయారీ రంగంలో వాటాను పెంచడం, వ్యాపార వ్యయాన్ని తగ్గించడం ద్వారా భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. 'జన విశ్వాస్' కు ప్రాధాన్యతనిస్తూ, ఎగుమతులను పెంచడానికి, భారతదేశ ప్రపంచ పోటీ తత్వాన్ని మెరుగు పరచడానికి విశ్వాసాన్ని బలపేతం చేయడం, వ్యాపార పరిస్థితులను మెరుగుపరచడం చాలా కీలకమన్నారు. భారతదేశ జనాభాలో దాదాపు 46 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని పేర్కొంటూ, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడం యొక్క ప్రాముఖ్యతను కూడా వివరించారు. ప్రపంచ ప్రమాణాలతో భారతదేశ వ్యవసాయ, పారిశ్రామిక పనితీరును బేరీజు వేసుకోవాలని ఆయన పట్టభద్రులను ప్రోత్సహించారు. పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించాలని, స్టార్టప్ లకు మద్దతు ఇవ్వాలని, రిస్క్ క్యాపిటల్ ను పొందేందుకు వీలు కల్పించాలని అమితాబ్ కాంత్ విద్యార్థులను కోరారు. 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న భారతదేశ ఆశయాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఈ దార్శనికతను సాధించడంలో యువ నిపుణులు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. భారతదేశ పురోగతిని గురించి ప్రస్తావిస్తూ, మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, డిజిటల్




విపట్టాల పొందిన కైటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ స్టూడెంట్స్ ఆనంద హేలి

కాంత్, గీతం ప్రెసిడెంట్ శ్రీభరత్

ప్రజా మౌలిక సదుపాయాలలో వేగవంతమైన పురోగతిని ఆయన ఉదహరించారు. డిజిటల్ చెల్లింపులలో నాయకత్వం, కోడివ్ 19 వ్యాక్సినేషన్ల వంటి భారీస్థాయి ప్రజా సేవల పంపిణీని కూడా ఆయన ప్రస్తావించారు. కృత్రిమ మేధస్సు, ఆరోగ్య సంరక్షణ, పోషణ వంటి రంగాలలో డిజిటల్ పబ్లిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) యొక్క పరివర్తనాత్మక సామర్థ్యాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. వర్తమాన కాలాన్ని 'భారతదేశ దశాబ్దం'గా అభివర్ణిస్తూ, అమితాబ్ కాంత్ దేశానికి ఉన్న జనాభా పరమైన ఆధిక్యతను ఎత్తిచూపుతూ, పట్టభద్రులు ఆశావాదంతో, నూతన ఆవిష్కరణతో, దేశ నిర్మాణానికి కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. తొలుత, ముఖ్య అతిథి, ఇతర ప్రముఖులు సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేయడంతో ఈ వేడుక లాంఛనంగా ప్రారంభమైంది. గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ తన అధ్యక్షోపన్యాసంలో, పట్టభద్రులను అభినందించి, ముఖ్య అతిథిని సత్కరించారు. కేఎస్ పీపీ సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ కన్వాల్ అమితాబ్ ను పరిచయం చేశారు. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు విద్యార్థి ప్రతినిధి సెహజానా కాంట్రాక్టర్ తో ప్రమాణ స్వీకారం ప్రతిని అందించి, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వ



ముఖ్య అతిథి అమితాబ్ కాంత్‌ను సత్కరిస్తున్న గీతం ప్రెసిడెంట్ శ్రీభరత్

హించారు. మొత్తం 35 మంది విద్యార్థులకు వారి డిగ్రీలతో పాటు, విద్యా నైపుణ్యాన్ని గుర్తించే మెరిట్ పతకాలను ప్రదానం చేశారు. పబ్లిక్ పాలసీ మాస్టర్స్ ప్రోగ్రామ్ లో మొదటి ర్యాంకు సాధించిన అభిజీత్ సుధీర్ రౌత్ కు అధ్యక్షుడి పేరిట నెలకొల్పిన బంగారు పతకం ఇచ్చి సత్కరించారు. ఉత్తమ క్యాప్ స్టోన్ ప్రాజెక్టుకు గాను సిమ్రాన్ కౌర్ డీన్ బంగారు పతకాన్ని అందుకున్నారు. యనమండ్ర మల్లికార్జునరావు స్మారక బంగారు పతకాన్ని అభిజీత్ సుధీర్ రౌత్, అమల్ శుక్లాలకు సంయుక్తంగా ప్రదానం చేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్, గీతం ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా సంతకం కోసం డిగ్రీ రికార్డులను సమర్పించారు. విద్యార్థి ప్రతినిధి అనుష్క శర్మ స్నాతకోత్సవ ప్రసంగం చేయగా, కేఎస్ పీపీ అధ్యాపకురాలు డాక్టర్ వసుధా కద్దు వందన సమర్పణ చేశారు. కేఎస్ పీపీ డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అక్బరుద్దీన్ కూడా పాల్గొన్నారు. పబ్లిక్ పాలసీ, పరిపాలన రంగంలో తమ వృత్తి ప్రస్థానాన్ని ప్రారంభించనున్న పట్టభద్రుల బృందానికి ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

## అంజయ్య నగర్ డివిజన్ సమస్యలపై

### డిప్యూటీ కమిషనర్‌కు ఆంజనేయులు సాగర్ వినతి




డిప్యూటీ కమిషనర్ కు వినతి పత్రం అందజేస్తున్న ఆంజనేయులు సాగర్ తదితరులు

**వీధి దీపాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి ,స్మశాన వాటిక అభివృద్ధి చేయాలని వినతి పత్రం**

ఈకబురు, శేరిలింగంపల్లి : అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ డివిజన్ సీనియర్ నాయకులు ఆంజనేయులు సాగర్ ఆధ్వర్యంలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు వినతి పత్రం సమర్పించారు. డివిజన్ పరిధిలో వీధి దీపాల ఏర్పాటు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం స్మశాన వాటికల అభివృద్ధిపై నిధులు విడుదల చేసి, పనులు ప్రారంభించాలని విన్నవించారు. శుక్రవారం సిఎంసి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసిన ఆంజనేయులు సాగర్ అంజయ్య నగర్ డివిజన్ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని సిద్ధిక్ నగర్, అంజయ్య నగర్, రాజీవ్ నగర్, బంజారా నగర్, గుల్షన్ నగర్, పిజేఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాత్రి వేళల్లో ప్రజలు వీధుల్లో సంచరించాలంటే చిమ్మ చీకట్లో భయాందోళన మధ్య వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. దీంతోపాటు అంజయ్య నగర్ డివిజన్ ప్రధాన రహదారిపై రోడ్డు దాటాలంటే పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పుటోవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. అంజయ్య నగర్ స్మశాన వాటిక అభివృద్ధిపై గతంలోనే అధికారులకు వినతి పత్రం సమర్పించడం జరిగిందని, వర్షాకాలంలో స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించాలంటే స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రానున్న వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని స్మశాన వాటిక అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని కోరారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ సాధ్యమైనంత త్వరగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్ సురేష్ సాగర్, పి. లక్ష్మయ్య సాగర్, రామకృష్ణ సాగర్, రోహిత్ సాగర్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాలుడిపై దాడి ఘటనలో..
## నిందితుడిపై పోక్సో కేసు నమోదు

**– ఏ2, ఏ3గా నిర్మాణ సంస్థ, సబ్ కాంట్రాక్టర్‌పై ఎఫ్ఐఆర్**




కొల్లూర్ పోలీస్ స్టేషన్

ఈ-కబురు, పటాన్‌చెరు :

సంగారెడ్డి జిల్లా కొల్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నిర్మాణ సంస్థ లేబర్ క్యాంపులో రెండున్నరేళ్ల బాలుడిపై దాడి ఘటనలో పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. చిన్నారి శరీరంపై ఎక్కడ పడితే అక్కడ కొరకడంతో తీవ్ర రక్త స్రావమైన బాలుడిని నీలోఫర్ ఆసుప్రతికి తరలించారు. ఈ ఘటనలో విచారణ చేపట్టిన కొల్లూర్ పోలుసులు నిందితుడి నుండి విషయాలు సేకరించి పోక్సో కేసు నమోదు చేశారు. కేసు వివరాల్లోకి వెళితే.. కొల్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉస్మాన్ నగర్‌లో రాజపుష్ప నిర్మాణ సంస్థలకు చెందిన లేబర్ క్యాంపు ఉంది. వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు భవన నిర్మాణ పనులు చేసుకుంటూ అక్కడే నివాసముంటున్నారు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన బాధితుడి తండ్రి అక్కడే పని చేస్తుండగా, గత కొన్ని రోజుల క్రితం బీహార్ రాష్ట్రానికి చెందిన పాండవు పాల్ (32) అనే వ్యక్తి కూడా కిరాణ షాపులో పని చేసేందుకు అక్కడికి వచ్చాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఫ్యామిలోని రెండున్నరేళ్ల బాలుడిని పాండవు పాల్ ఎత్తుకెళ్లి లైగింక దాడి చేశాడు. బాలుడిని దారుణంగా హిసించి, ప్రైవేట్ పార్ట్స్, ఇతర శరీర భాగాలపై కొరకడంతో తీవ్ర రక్త స్రావమైంది. చిన్నారి అరుపులు గమణించిన స్థానికులు పాండవు పాల్‌ను పట్టుకొని గాయాలపాలైన బాలుడిని ఆసుపత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషయంగా ఉండటంలతో నీలోఫర్‌కు తరలించి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. బాలుడి తండ్రి ఫిర్యాదులో కేసు నమోదు చేసిన పోలీసులు మొదట కేవలం దాడి ఘటనగానే బావించినా నిందితుడి విచారణలో పూర్తి విషయాలు రాబట్టి పోక్సో కేసును నమోదు చేశారు. నిందితుడు పాండవు పాల్‌తో పాటు ఏ2గా రాజపుష్ప మేనేజ్‌మెంట్, ఏ3గా సబ్ కాంట్రాక్టర్‌ను కూడా చేర్చి కొల్లూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ గణేశ్ పటేల్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండొద్దు

## గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



అధికారులు స్థానికులతో అభివృద్ధి పనులపై చర్చిస్తున్న గంగాధర్ రెడ్డి



కాలనీలో పర్యటిస్తున్న మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**గోపనపల్లి, సాయిరాం కాలనీల్లో అధికారులతో కలిసి గంగాధర్ రెడ్డి పర్యటన**

ఈకబురు, శేరిలింగంపల్లి : అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండొద్దని, ప్రజా సమస్యలపై తక్షణమే స్పందిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అధికారులకు సూచించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లి, సాయి రామ్ నగర్ కాలనీ లో నెలకొన్న సీసీ రోడ్డు, డ్రైనేజ్ సమస్యలను పరిష్కరించేందుకు మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి సంబంధిత శాఖ అధికారులతో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు రోడ్ల దుస్థితి, వర్షాకాలంలో నిల్వ ఉండే మురుగు నీరు, డ్రైనేజీ అడ్డంకుల వల్ల తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను మాజీ కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను నిశితంగా పరిశీలించిన గంగాధర్ రెడ్డి వెంటనే సంబంధిత జలమండలి అధికారులు, జిహెచ్ఎంసీ అధికారులు తగిన చర్యలు చేపట్టి సీసీ రోడ్డు నిర్మాణం, డ్రైనేజ్ మరమ్మతులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రజల మౌలిక సదుపాయాలే ప్రథమ ప్రాధాన్యంగా ముందుకు వెళుతున్నామని, పలు కాలనీలలో ప్రజల నుండి వచ్చిన వినతుల మేరకు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అత్యవసరం ఉన్న చోట ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామని అన్నారు. కాలనీలలో మౌలిక వసతులు కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ.. కాలనీలు, బస్తీలను ఆదర్శవంతంగా. చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ఈశ్వర్ కుమార్ సీనియర్ నాయకులు రమేష్, శేఖర్, శ్రీశైలం, నర్సింగ్ రావు, సూపర్వైజర్ సురేష్, లైన్ మ్యాన్ శ్రీకాంత్ ,తదితరులు పాల్గొన్నారు.

## 52.8 శాతానికి చేరిన ఆర్టీసీ ఉద్యోగుల

# కరువు భత్యం




ఈకబురు, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగుల కరువు భత్యం 52.8 శాతానికి చేరుకుంది. ఇప్పటివరకు 50.7 శాతం ఉండగా, శుక్రవారం మరో 2.1 శాతం డీఏను ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాదికి సంబంధించి జనవరిలో ప్రకటించాల్సిన తొలివిడత డీఏ పెండింగ్‌లో ఉండటంతో, దాన్ని చెల్లించాల్సిందిగా ఉద్యోగులు కొంతకాలంగా ఒత్తిడి చేస్తూ వస్తున్నారు. కానీ, ప్రభుత్వం దానిపై నిర్ణయం తీసుకోకుండా దాటవేస్తూ వచ్చింది. శుక్రవారం ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడీలు, ఇతర ఉన్నతాధికారులతో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భేటీ అయి దీనిపై చర్చించారు.

అనంతరం 2.1 శాతం కరువు భత్యాన్ని ప్రకటించారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులకు పెండింగ్ కరువు భత్యం మొత్తం చెల్లించినట్టయింది. గతంలో ఆరేడు విడతల డీఏ పేరుకుపోగా, గత ప్రభుత్వం చివరలో కొన్ని విడతలు, ప్రస్తుతం ప్రభుత్వం మరికొన్ని విడతల డీఏను ప్రకటిస్తూ వచ్చాయి. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న తాజా విడత డీఏ కూడా ఇప్పుడు ఉద్యోగుల జీతంలో కలిసిపోనుంది. ఈ పెంపు వల్ల సంస్థపై ప్రతినెలా రూ.2.82 కోట్ల మేర ఆర్థిక భారం పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి ఆమేరకు చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి పొన్నం పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి చాలా పెండింగ్ అంశాలను పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న డీఏ ప్రకటించటం పట్ల ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఈడీలు వెంకన్న, ఖుస్రో షా ఖాన్, రాజశేఖర్, సాల్మన్, ఎఫ్ఏ విజయపుష్ప, సీటీఎం- సి శ్రీధర్, సీపీఎం ఉషాదేవి, సీసీఈ కవిత తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెరుగుతుంది

## రాగం హరిశంకర్ యాదవ్

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**

క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెరుగుతుందని నల్లగండ్ల డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాగం హరిశంకర్ యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం చందనగర్ పరిధిలోని నాగార్జున గ్రామర్ హై స్కూల్‌లో న్యూ మోంక్స్ కుంగ్‌ఫూ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో కుంగ్‌ఫూ బెల్ట్ ప్రదానోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్లగండ్ల డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు రాగం హరిశంకర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన సుమారు 40 మంది విద్యార్థులకు తదుపరి స్థాయి బెల్టులు, ధృవపత్రాలను అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో హరిశంకర్ యాదవ్ మాట్లాడుతూ క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ధైర్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కుంగ్‌ఫూ వంటి శిక్షణలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని కూడా పెంచుతాయన్నారు. విద్యార్థులు నిరంతర సాధనతో ఉన్నత స్థాయిలకు ఎదిగి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. నేటి యువత చదువుతోపాటు క్రీడల్లోనూ ఉత్తమంగా రాణించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కుంగ్‌ఫూ నైపుణ్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. చిన్న వయస్సులోనే ఈ తరహా శిక్షణ పొందడం వారి సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల కొరస్పాండెంట్ కె. శ్రీనివాస్ శంకర్, ప్రధానోపాధ్యాయురాలు కె. శిరీష, తెలంగాణ కుంగ్‌ఫూ అసోసియేషన్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఎన్. బాలరాజు యాదవ్, రంగారెడ్డి జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ జి. రమేష్, మహబూబ్‌నగర్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కె. సత్యం, బ్రూస్ లీ కుంగ్‌ఫూ ప్రతినిధి నందు, హైదరాబాద్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఏ. యోగేశ్వర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




తలకు ధ్రువపత్రాలు బెల్టులు అందజేస్తున్న హరి శంకర్ యాదవ్




కార్యక్రమంలో ప్రసంగిస్తున్న రాగం హరిశంకర్ యాదవ్



## ఎంత పడ్డాయో.. అంత పెరిగాయ్

దేశీయ ప్రధాన సూచీలు గురువారం ఎంత (931 పాయింట్లు) నష్టపోయాయో.. ఇంచుమించు అదే స్థాయిలో శుక్రవారం లాభాలు నమోదుచేశాయి. బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు తోడ్పడ్డాయి. అమెరికా ఇరాన్ చర్చల నేపథ్యంలో పశ్చిమాసియా ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టొచ్చన్న ఆశలు, విదేశీ మార్కెట్ల సానుకూల సంకేతాలు మన మదుపర్ల సెంటిమెంట్‌ను బలోపేతం చేశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 32 పైసలు తగ్గి 92.83 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.10% నష్టంతో 95.80 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లన్నీ సానుకూల ధోరణిలోనే ముగియగా.. ఐరోపా మార్కెట్లూ లాభాల్లోనే ఆరంభమయ్యాయి. పాకిస్తాన్ స్టాక్ ఎక్స్ఛేంజీకి చెందిన కేఎస్ఈ100 సూచీ 1,400 పాయింట్లు లాభపడింది.

బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.6.44 లక్షల కోట్లు పెరిగి రూ.451.23 లక్షల కోట్ల (4.87 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

సానుకూల ధోరణిలోనే..: ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 77,121.01 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,631.65) లాభాల్లో ఆరంభమైంది. అదే ఒరవడి కొనసాగిస్తూ 77,622.50 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 918.60 పాయింట్ల లాభంతో 77,550.25 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 275.50 పాయింట్లు పెరిగి 24,050.60 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 23,856.35 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 24,074.05 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని ఈ సూచీ నమోదు చేసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 4,231, నిఫ్టీ 1,338 పాయింట్లు పెరిగాయి.

అయిదు కంపెనీలు డీలా..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 5 మినహా మిగతావన్నీ లాభాల్లో ముగిశాయి. ఏషియన్ పెయింట్స్ 3.97%, ఐసీఐసీఐ బ్యాంక్ 3.22%, మహీంద్రా అండ్ మహీంద్రా 2.98%, యాక్సిస్ బ్యాంక్ 2.49%, ఎస్‌బీఐ 2.48%, ఇండిగో 2.42%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.35%, బజాజ్ ఫైనాన్స్ 2.3% చొప్పున పెరిగాయి. సన్‌ఫార్మా 3.65%, ఇన్ఫోసిస్ 2.94%, టీసీఎస్ 2.45%, టెక్ మహీంద్రా 1.44%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 0.98% మేర నష్టపోయాయి. బీఎస్ఈలో రంగాల సూచీల విషయానికొస్తే భారీ యంత్రపరికరాలు, మన్నికైన వినియోగ వస్తువులు, ఇండస్ట్రియల్స్, బ్యాంకెక్స్, స్థిరాస్తి రాణించగా.. ఐటీ సూచీ డీలాపడింది. బీఎస్ఈలో 3,360 కంపెనీల షేర్లు లాభాల్లో, 945 కంపెనీల షేర్లు నష్టాల్లో ముగిశాయి. 144 కంపెనీల షేర్ల ధరలో ఎలాంటి మార్పులేదు.

బిదాడిలోని టొయోటా టెక్నికల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ వద్ద సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేసేందుకు విప్రో 3డీతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు టొయోటా కిర్లోస్కర్ మోటార్ తెలిపింది.

తుర్కియేలో ఫౌండ్రీ వ్యాపారం నుంచి మహీంద్రా అండ్ మహీంద్రా వైదొలగింది. అక్కడి అనుబంధ సంస్థ ఎర్కుంట్ ఫౌండ్రీలో తనకున్న 99.04% వాటాను హిసార్లర్ మకిన సనాయి కన్సార్షియంకు విక్రయించింది.

ఫలించని టీసీఎస్ ఫలితాలు

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) జనవరి మార్చి ఫలితాలు విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే ఉన్నా, మదుపర్లు సంతృప్తి చెందకపోవడంతో, ఈ కంపెనీ షేరుకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. బీఎస్ఈలో 2.45% నష్టపోయి రూ.2,524.35 వద్ద ముగిసింది. మార్కెట్ విలువ రూ.22,938.67 కోట్లు తగ్గి రూ.9,13,331.92 కోట్లకు పరిమితమైంది.

విదేశీ మారకపు నిల్వల్లో వృద్ధి

మన విదేశీ మారకపు నిల్వలు ఏప్రిల్ 3తో ముగిసిన వారంలో 9.063 బిలియన్ డాలర్లు పెరిగి 697.121 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతకుముందు వారంలో ఇవి 10.288 బిలియన్ డాలర్లు తగ్గి 688.058 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం.. ఏప్రిల్ 3తో ముగిసిన వారంలో కీలకమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 1.784 బిలియన్ డాలర్లు పెరిగి 552.856 బిలియన్ డాలర్లకు చేరాయి. పసిడి నిల్వలు 7.221 బిలియన్ డాలర్లు అధికమై 120.742 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 58 మిలియన్ డాలర్లు పెరిగి 18.707 బిలియన్ డాలర్లకు చేరగా.. అంతర్జాతీయ ద్రవ్యనిధి వద్ద భారత నిల్వల స్థితి ఎలాంటి మార్పు లేకుండా 4.816 బిలియన్ డాలర్ల వద్ద ఉంది.

## అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీల్లోకి ప్రభుత్వ రంగ బ్యాంకులూ!




ముంబయి: అప్పర్ లేయర్ (అగ్రశ్రేణి) బ్యాంకింగేతర ఆర్థిక కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లను గుర్తించే అర్హతల్లో మార్పులను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ప్రతిపాదించింది. అంతక్రితం ఉన్న పారామెట్రిక్ వ్యవస్థకు బదులుగా, ఆస్తుల పరిమాణం ఆధారిత విధానానికి మొగ్గుచూపింది. తాజా ముసాయిదా ప్రకారం.. రూ.లక్ష కోట్లకు పైగా ఆస్తులున్న సంస్థలను ఎన్‌బీఎఫ్‌సీఅప్పర్ లేయర్(యూఎల్)గా గుర్తిస్తారు. టాటా సన్స్ లిస్టింగ్‌పై చర్చ జరుతున్న సమయంలో ఈ ముసాయిదా వెలువడడం గమనార్హం. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం, అగ్రగామి 15 అప్పర్ లేయర్ సంస్థలు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కావాలి. 2025 అక్టోబరు నాటి గడువు పూర్తయినా, టాటా సన్స్ ఒక్కటే ఆ జాబితాలో నమోదు కాని కంపెనీగా మిగిలింది.

ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే కంపెనీలను సైతం ఎన్‌బీఎఫ్‌సీయూఎల్ జాబితాలో చేర్చాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎన్‌బీఎఫ్‌సీలు ప్రాథమిక లేదా మధ్య తరహా ఎన్‌బీఎఫ్‌సీలుగా గుర్తిస్తున్నారు మినహా అగ్రగామి ఎన్‌బీఎఫ్‌సీలుగా పరిగణించడం లేదు.

అదనపు ద్రవ్యలభ్యత నేపథ్యంలో రూ.2 లక్షల కోట్ల వేరియబుల్ రేట్ రివర్స్ రెపో(వీఆర్‌ఆర్‌ఆర్) వేలాన్ని ఆర్‌బీఐ నిర్వహించనుంది. ఈనెల 17న మధ్యాహ్నం 2 2:30 గంటల మధ్య ఇది జరుగుతుంది.

## ప్రపంచ సాంకేతిక పటంలో ఏపీకి నవశకం

ఈ కబురు, అమరావతి :

నవశకం సాంకేతికత క్వాంటం టెక్నాలజీలో గ్లోబల్ లీడర్ గా అమరావతి ఎదుగుతోంది. నేషనల్ క్వాంటం మిషన్ లక్ష్యాలను అందిపుచ్చుకుని దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రంగా రూపు దిద్దుకుంటోంది. క్వాంటం టెక్నాలజీలో పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా అవసరమైన ఎకోసిస్టం సిద్ధమవుతోంది. మూడు దశాబ్దాల క్రితం ఐటీ విప్లవానికి నాంది పలికిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీ తో ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ ప్రపంచానికి చిరునామాగా మారుస్తున్నారు. ఏప్రిల్ 14, ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి స్వదేశీ క్వాంటం కంప్యూటర్ల టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీని సీఎం ప్రారంభించనున్నారు. గన్నవరంలోని మేధాటవర్స్ తో పాటు రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లో 1ఎస్, 1 క్యూ పేరిట రెండు వేర్వేరు క్వాంటం టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలు ప్రారంభం కానున్నాయి. దీంతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్సు ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. ఈ స్వదేశీ నిర్మిత క్వాంటం రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీలు అమరావతిని ఓ అత్యాధునిక క్వాంటం ఎకోసిస్టమ్ గా తీర్చిదిద్దనున్నాయి. పూర్తి స్వదేశీ టెక్నాలజీతో భారత్ లోనే తొలిసారి క్వాంటం కంప్యూటర్ హార్డ్‌వేర్‌ను పరీక్షించే సౌకర్యాన్ని అమరావతిలో ఏర్పాటు చేశారు. అమరావతి 1Q పేరిట మినీ క్వాంటం కంప్యూటింగ్ టెస్టింగ్ ఫెసిలిటీని గన్నవరంలోని మేధా టవర్స్‌లో ఏర్పాటు చేశారు. అమరావతి 1S పేరిట రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో విద్యార్థులు, పరిశోధకుల కోసం ఇది 'ఓపెన్ యాక్సెస్' ప్రాతిపదికన మరో క్వాంటం రిఫరెన్సు టెస్ట్ ఫెసిలిటీని తీర్చిదిద్దారు. క్వాంటం కంప్యూటింగ్ ప్రక్రియను ప్రత్యక్షంగా వీక్షించేలా ఓపెన్ యాక్సెస్ రిఫరెన్సు ఫెసిలిటీగా దీనిని ఏర్పాటు చేశారు.

--క్వాంటం హార్డ్‌వేర్ తయారీలో కీలకం

మేధాటవర్స్ సహా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తున్న ఈ క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీ టెస్ట్ బెడ్ లు క్వాంటం హార్డ్ వేర్ తయారీలో కీలకం కానున్నాయి. ఈ రెండు చోట్లా మైనస్ 273 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో క్వాంటం కంప్యూటర్లు పనిచేయనున్నాయి. క్వాంటం కంప్యూటర్లలో ఉపకరించే వివిధ పరికరాలను టెస్ట్ చేసేలా ఈ రిఫరెన్సు ఫెసిలిటీలు తోడ్పాటు అందించనున్నాయి. క్వాంటం టెక్నాలజీలో కేవలం సాఫ్ట్‌వేర్ అల్గారిథమ్స్ తో పాటు హార్డ్‌వేర్ తయారీలోనూ స్వయం సమృద్ధి సాధించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం. ఇందులో భాగంగా క్వాంటం కంప్యూటర్లకు అవసరమైన పరికరాలను తయారు చేయాలని కూడా లక్ష్యంగా నిర్దేశించారు. ఇటీవలే 30కి పైగా క్వాంటం హార్డ్‌వేర్ తయారీ సంస్థలతో ముఖ్యమంత్రి సమావేశం కూడా నిర్వహించారు. అమరావతిలో ఏర్పాటు అవుతున్న క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ భారత్ లో క్వాంటం హార్డ్‌వేర్ నెట్‌వర్క్‌కు యాంకర్ నోడ్‌గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించారు. క్వాంటం తయారీ రంగంలో క్రయోజెనిక్స్ లాంటి సాంకేతికతలను ఉపయోగించి ప్రెసిషన్ ఎలక్ట్రానిక్స్, క్వాంటం గ్రేడ్ ఫ్యాబ్రికేషన్ లాంటి రంగాల్లో స్వదేశీ క్వాంటం కంప్యూటింగ్ ఉపకరణాల తయారీకి కేంద్రంగా అమరావతి మారాలన్నది ఈ ఆలోచన ముఖ్య ఉద్దేశం. ఇక్కడ పరీక్షించిన క్వాంటం కంప్యూటింగ్ పరికరాలకు సర్టిఫికేషన్ ఇచ్చేలా ఈ టెస్ట్ ఫెసిలిటీలను సిద్ధం చేశారు.

-ఆధునిక గ్లోబల్ టెక్ హబ్ గా ఏపీ

అమరావతిని ప్రపంచంలోని మొదటి 5 క్వాంటం హబ్‌లలో ఒకటిగా తీర్చిదిద్దేలా రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తోంది. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం క్వాంటం కంప్యూటింగ్ పాలసీ 202530ని కూడా విడుదల చేసింది. గత ఏడాది జూన్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్వాంటం డిక్లరేషన్ ను కూడా ప్రకటించారు. అమరావతిలోని ఉద్దండరాయుని పాలెం వద్ద 50 ఎకరాల్లో ఏక్యూఏసీ కేంద్రం నిర్మితం అవుతోంది. ఆరు టవర్లుగా నిర్మిస్తున్న ఈ భవనాల్లో అంతర్జాతీయ టెక్ దిగ్గజం ఐబీఎం భాగస్వామ్యంతో అత్యంత శక్తివంతమైన 133 క్యూబిట్, 5 కే గేట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కానుంది. ఐబీఎంతో పాటు టీసీఎస్, ఎల్ అండ్ టీ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తున్నాయి. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, కేంద్ర ప్రభుత్వంలోని సీఐఎస్ఆర్ నేతృత్వంలోని నేషనల్ టెస్టింగ్ ల్యాబ్ లాంటి సంస్థలు కూడా దీనికి సహకారాన్ని అందిస్తున్నాయి. నూతన ఔషధాల ఆవిష్కరణ, సంక్లిష్ట వ్యాధులకు వ్యాక్సీన్ల ఉత్పత్తిలో వేగం, వెదర్ మోడలింగ్, సెమీ కండక్టర్ల పాలన, లాజిస్టిక్స్ రంగాల్లో డేటా అనలటిక్స్, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో కీలకమైన పరిశోధనలు చేసేలా దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ అమరావతిలో త్వరలోనే ఆవిష్కృతం కానుంది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం నుంచి పరిశోధనలు, ఆవిష్కరణల కోసం ఇప్పటికే 80కి పైగా అంతర్జాతీయ స్థాయి కంపెనీలు, విద్యా సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. క్వాంటం కంప్యూటింగ్ అల్గారిథమ్స్ లో నిపుణులైన మానవ వనరులను సిద్ధం చేసేందుకు ఐఐటీ చెన్నై, వైసర్ లాంటి సంస్థలతో ప్రభుత్వం భాగస్వామ్యం కూడా కుదుర్చుకుంది. క్వాంటంలో నైపుణ్యాల కోసం ఇప్పటికే 60 వేల మంది శిక్షణ పొందుతున్నారు. వచ్చే ఐదేళ్లలో 45 లక్షల మందిని క్వాంటం నిపుణులుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది.



## జీహెచ్‌ఎంసీలో తీవ్రమైన అవినీతికి ముఖ్యమంత్రే బాధ్యులు

ఈ కబురు, హైదరాబాద్ :

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీహెచ్‌ఎంసీని అవినీతికి కేరాఫ్ గా మార్చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. టెండర్లు లేకుండానే కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్ట్‌లను తన అనుచరులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దాదాపుగా 1148 కోట్ల రూపాయల కాంట్రాక్టులను నామినేషన్ పద్ధతిలో ఇచ్చారని కవిత చెప్పారు. జీహెచ్‌ఎంసీ, హెచ్ ఎండీఏలో జరుగుతున్న అవినీతిపై శుక్రవారం బంజారాహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.5 లక్షలకు మించి ఉండే ఏ పని అయినా సరే టెండర్లు పిలవాల్సి ఉన్నా నిబంధనలు ఉల్లంఘిస్తూ కోట్ల రూపాయల పనులను టెండర్లు లేకుండానే కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఇది తెలంగాణ స్టేట్ ఫైనాన్షియల్ కోడ్ ను ఉల్లంఘించటమేనని చెప్పారు. టెండర్లు లేకుండా కాంట్రాక్ట్ ఇవ్వవద్దని 2023 లో ఏర్పాటైన కమిటీ కూడా స్పష్టం చేసిందని కవిత గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 480 కోట్ల రూపాయల పనులను ఇదే విధంగా కట్టబెడితే.. రేవంత్ రెడ్డి సర్కార్ దాన్ని కొనసాగిస్తూ రూ.1,148 కోట్ల పనులను తన అనుచరులకు నామినేషన్ పద్ధతిలో ఇచ్చిందని చెప్పారు. ఇందులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. నామినేషన్ పద్ధతిలో ఇచ్చిన పనులను వెంటనే రద్దు చేసి టెండర్ల ద్వారా కాంట్రాక్ట్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నామినేషన్ పద్ధతిలో ఈ ప్రభుత్వం పిలిచిన డిపార్ట్‌మెంట్లలో స్కిల్డ్ లేబర్ ఉంటే వారికి కూడా జీతాల్లో అన్యాయం చేస్తున్నారన్నారు. 23 వేలకు పైగా వారికి జీతాలు ఇవ్వాల్సి ఉండగా కేవలం 13 వేలు ఇస్తున్నారని చెప్పారు. మొక్కల పెంపకాలు, పంపకాలు, కొనుగోళ్లలో కూడా భారీ ఎత్తున అవినీతికి పాల్పడ్డారని కవిత ఆరోపించారు. ఔటర్ రింగ్ రోడ్డు కు సంబంధించిన ఓ కంపెనీ పై వేసిన సిట్ ఏమైందని కవిత ప్రశ్నించారు. ముఖ్యమంత్రితో సిట్టింగ్ అవటంతో ఆ సిట్ ను పత్తా లేకుండా చేశారా అని అనుమానం వ్యక్తం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డును కాంట్రాక్టర్ కు అప్పగించి...అక్కడి మెయింటెనెన్స్ ను ప్రభుత్వం చేస్తుండటం అత్యంత దారుణమని విమర్శించారు.

ఈడీకి ఫిర్యాదు చేస్తాం..

జీహెచ్‌ఎంసీ అంటే గుంపు మేస్త్రీ అవినీతికి అడ్డా అన్నట్లు ఈ విభాగాన్ని తయారు చేశారని కవిత మండిపడ్డారు. హెచ్‌ఎండీఏ పరిధిలో 35 వేల కోట్ల రూపాయల విలువైన భూములను అమ్మేసి.. హైదరాబాద్ అభివృద్ధికి రూపాయి కూడా ఖర్చు చేయలేదని చెప్పారు. పైగా తన అవినీతిని మరింత పెంచుకునేందుకు ఈ ముఖ్యమంత్రి ఫ్యూచర్ సిటీ అంటూ హంగామా చేస్తున్నారన్నారు. హైడ్రా పేరుతో ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారులను హడలెత్తించటమే కాకుండా స్క్వేర్ ఫీట్ కు 150 రూపాయలంటూ వారి వద్ద వసూలు చేస్తున్నారని కవిత విమర్శించారు. వీటికి సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. వెంటనే ఈ బ్లాక్ మెయిల్ దందా ఆపకపోతే ఈడీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

కమీషన్ల కోసం కాళేశ్వరం మరమ్మత్తులు

కాళేశ్వరం ప్రాజెక్ట్ మరమ్మత్తులు చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావటాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. అయితే కమీషన్ల కక్కుర్తి కోసం కాకుండా చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. కాళేశ్వరం ఫెయిల్ అయ్యిందని చెప్పేందుకు ఎనిమిదిన్నర లక్షల ఎకరాల భూమిని ఎండబెట్టిన కర్కోటక ప్రభుత్వం ఇది అని విమర్శించారు. కేవలం కమీషన్ల కోసమే కాళేశ్వరం మరమ్మత్తులను ఈ ప్రభుత్వం చేపడుతున్నట్టుగా తాను భావిస్తున్నానని అన్నారు. కాళేశ్వరం ప్రయోజనాలను రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మహిళ రిజర్వేషన్ల బిల్లు విషయంలో బీజేపీ మోసపూరితంగా వ్యవహరిస్తోందని కవిత ఆరోపించారు. బిల్లు అమలుకు 2011 జనాభా లెక్కలను ప్రతిపాదికకగా తీసుకోవటం అన్యాయమన్నారు. 2027 జనగణనలో బీసీ గణన కూడా చేపట్టనున్న నేపథ్యంలో అప్పటి వరకు వేచి ఉండాలన్నారు. ఇప్పటికే లోక్‌సభ ఎన్నికలు సహా, 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు అన్యాయం జరిగిందని చెప్పారు. 2027 జన గణన తర్వాతనే మహిళ బిల్లు అమలు చేయాలని...అదే విధంగా ఓబీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై బీసీ మహిళలంతా కూడా పోరాటానికి సిద్ధం కావాలని కవిత పిలుపునిచ్చారు. మహిళ రిజర్వేషన్ డ్రాఫ్ట్ బిల్లును కూడా తాము పరిశీలిస్తామని చెప్పారు. అవసరమైతే ఢిల్లీకి కూడా వెళ్తామన్నారు. నిజామాబాద్ ఎంపీ అర్వింద్ తన గురించి పిచ్చి పిచ్చిగా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎవరో మద్దతిస్తే బతుకుతానని మాట్లాడటమంటే అది పురుషాహంకారమేనని మండిపడ్డారు. తాను తెలంగాణ ఉద్యమంలో రాటుదేలి ప్రజల మధ్యలో పనిచేశానని చెప్పారు. ఇప్పుడు కూడా ప్రజల కోసం పనిచేసేందుకు వచ్చానని స్పష్టం చేశారు. తెలంగాణ మహిళలు స్వయంప్రతిపత్తితో సొంతంగా ఆలోచించే సత్తా ఉన్నవాళ్లని అన్నారు.

సభ ఏర్పాట్ల పర్యవేక్షణకు 21 కమిటీలు

ఈ నెల 25 న జరగనున్న పార్టీ ఆవిర్భావ సభ ఏర్పాట్ల పర్యవేక్షణకు 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. ఒక్కో కమిటీలో 30 మంది సభ్యులుంటారన్నారు. అదే విధంగా 500 మంది వాలంటీర్లు ఉంటారన్నారు. ట్రాఫిక్ సమస్యలు, సభ ఏర్పాట్లకు ఎలాంటి ఆటంకాలు లేకుండా వారంతా కోఆర్డినేట్ చేసుకుంటారన్నారు. సభ ఏర్పాట్ల వివరాల కోసం కమిటీ మెంబర్లను సంప్రదించాలని సూచించారు.



## మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ: డీజీపీ



ఈ కబురు, హైదరాబాద్: మావోయిస్టు రాష్ట్ర కమిటీ నేతల లొంగుబాటు తర్వాత మిగిలిన 11 మంది జనజీవన స్రవంతిలోకి రావడంతో తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రంగా మారిందని డీజీపీ బి.శివధర్‌రెడ్డి ప్రకటించారు. అయితే తెలంగాణ ప్రాంతానికి చెందిన మావోయిస్టు అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, పసునూరి నరహరి సహా ఐదుగురు ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కమిటీకి చెందిన 11 మంది సహా మొత్తం 42 మంది మావోయిస్టులు డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం జనజీవన స్రవంతిలోకి వచ్చారు. వీరు ఐదు ఏకే 47 రైఫిళ్లు, నాలుగు ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు సహా మొత్తం 36 ఆయుధాలతోపాటు రాష్ట్ర కమిటీకి చెందిన 800 గ్రాముల బంగారాన్ని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇంటెలిజెన్స్ ఏడీజీ విజయ్‌కుమార్, గ్రేహౌండ్స్ ఏడీజీ అనిల్‌కుమార్, అడిషనల్ డీజీ స్వాతిలక్రా, ఎస్ఐబీ చీఫ్, ఐజీ సుమతితో కలిసి డీజీపీ శివధర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర కమిటీలో పనిచేస్తున్న ములుగు జిల్లా తడపాల గ్రామానికి చెందిన కుంజం ఇడుమాల్ అలియాస్ మహేందర్‌తోపాటు పీఎల్‌జీఏ బెటాలియన్ ఇన్‌చార్జ్, దండకారణ్యం స్పెషల్‌జోనల్ కమిటీ సభ్యుడు సోడిమల్లు సహా మొత్తం 42 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చినట్టు తెలిపారు.

42 మందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పునరావాసం కింద మొత్తం రూ.కోటి 93 లక్షలు అందిస్తున్నట్టు తెలిపారు. ఇందులో తెలంగాణకు చెందిన కుంజం ఇడుమాల్‌కు రూ.4 లక్షల చెక్, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారికి రూ.25 వేలు చొప్పున తక్షణ సాయం కింద అందజేశామన్నారు. మాజీ మావోయిస్టుల ఆరోగ్య పరిరక్షణకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు హెల్త్‌కార్డుల జారీ ప్రక్రియ తుది దశకు చేరిందని, రెండు రోజుల్లో జీఓ వస్తుందని తెలిపారు. హెల్త్‌కార్డులకు ఎలాంటి పరిమితి లేదని, నిమ్స్ సహా ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో వైద్యసాయం పొందొచ్చని తెలిపారు. మావోయిస్టులు వివిధ ప్రాంతాల్లో పాతిపెట్టిన బాంబుల వెలికితీతలో మాజీల సాయం తీసుకుంటున్నట్టు డీజీపీ తెలిపారు. కొందరు మావోయిస్టు అగ్ర నేతలు తాము అరెస్టయినట్టు ప్రకటించుకున్న అంశంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు డీజీపీ స్పందిస్తూ..40 ఏళ్లపాటు ఉద్యమంలో పనిచేసిన తర్వాత లొంగిపోయారంటే వారికి కొంత అగౌరవంగా ఉండొచ్చని, గౌరవం కోసం వారు తాము అరెస్టయ్యామని చెప్పినా, పోలీసులకు ఎలాంటి నష్టం లేదన్నారు. అరెస్టయిన వారు జైలులో ఉంటారు కానీ, బయట ఉండరు కదా అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులను పోలీసుల నిర్బంధంలో ఉంచుతున్నారన్న విమర్శలు సరికాదని డీజీపీ స్పష్టం చేశారు.మావోయిస్టు అగ్రనేత గణపతి బతికే ఉన్నారని, అయితే అటవీ ప్రాంతంలో లేరని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మావోయిస్టుల లొంగుబాటులో కీలకంగా పనిచేసిన ఎస్ఐబీ చీఫ్ సుమతి బృందాన్ని డీజీపీ ప్రత్యేకంగా అభినందించారు. మావోయిస్టుల్లో తెలంగాణ ప్రాంతం నుంచి అజ్ఞాతంలో ఉన్న ఐదుగురు సైతం జనజీవన స్రవంతిలోకి రావాలని విజ్ఞప్తి చేశారు. 2024 నుంచి ఇప్పటి వరకు నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు సహా మొత్తం 761 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయినట్టు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. 302 ఆయుధాలను మావోయిస్టులు పోలీసులు అప్పగించినట్టు తెలిపారు.

# సంక్రాంతి లక్ష్యంగా!




కథానాయకుడు నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం గోపీచంద్ మలినేని సినిమాని చకచకా పరుగులు పెట్టిస్తున్నారు. ఇది ఈ ఏడాది ద్వితీయార్ధంలోనే తెరపైకి రానుంది. అయితే ఇది పూర్తయ్యేలోపే బాలకృష్ణ మరో కొత్త చిత్రాన్ని పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. 'నాంది' ఫేమ్ విజయ్ కనకమేడల ఇటీవల ఆయనకు ఓ శక్తిమంతమైన పోలీసు కథ వినిపించి.. ఒప్పించినట్లు తెలిసింది. ఈ ప్రాజెక్ట్ కోసం బాలయ్య జులై నుంచి డేట్స్ ఇచ్చినట్లు సమాచారం. అన్నీ కుదిరితే సంక్రాంతి లక్ష్యంగానే దీన్ని తెరపైకి తీసుకొచ్చే అవకాశముంది. ఇప్పటికే ఈ చిత్ర పూర్వ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని.. దీన్ని ఎస్ఎల్వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మించనున్నారని తెలుస్తోంది. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది.

## బేషరతుగా రణ్‌వీర్ సింగ్ క్షమాపణ



'కాంతార' చిత్రంలో దైవ పాత్రను అవమానించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న తాను పరిష్కృత క్షమాపణ పత్రాన్ని దాఖలు చేస్తానని బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ కర్ణాటక హైకోర్టుకు ప్రమాణపత్రాన్ని సమర్పించారు. రణ్‌వీర్ ఇప్పటికే దాఖలు చేసిన క్షమాపణ లేఖలో పశ్చాత్తాపం లేదని, ఫిర్యాదు చేయడమే తప్పు అన్నట్లు ఉందని అర్జీదారుని తరపు న్యాయవాది వాదించారు. బెంగళూరు హై గ్రౌండ్స్ ఠాణాలో నమోదైన కేసును రద్దు చేయాలని రణ్‌వీర్ దాఖలు చేసిన అర్జీపై జస్టిస్ ఎం.నాగప్రసన్న విచారణ కొనసాగించారు. ఇప్పటికే రణ్‌వీర్ దాఖలు చేసిన ప్రమాణపత్రం, క్షమాపణల పత్రంలోని అంశాలను న్యాయమూర్తి ముందు చదివి వినిపించారు. ఈ నెల 18న మైసూరులోని చాముండేశ్వరి బెట్టకు కూడా రణ్‌వీర్ వస్తున్నారని తెలిపారు.అర్జీదారుడు, అతని న్యాయవాదితో చర్చించి, వారికి తృప్తి కలిగించే భాషలో పరిష్కృత ప్రమాణ పత్రాన్ని దాఖలు చేస్తామని రణ్‌వీర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. తదుపరి విచారణను ఈనెల 23కు వాయిదా వేశారు. 'ఘటన జరిగిన రోజు తాను దైవాన్ని, భక్తుల భావనల్ని దెబ్బతీశానని నేను అర్థం చేసుకోలేకపోయాను. నేను ముంబయిలో సింధీ కుటుంబంలో జన్మించి ఉండడంతో అందులోని ఘనతను అర్థం చేసుకోలేకపోయాను. ఈ ప్రమాణపత్రం ద్వారా నేను తీవ్ర విషాదాన్ని వ్యక్తం చేస్తున్నాను. నేను నిజాయతీగా, బేషరతుగా క్షమాపణలు కోరుతున్నాను.రానున్న రోజుల్లో మైసూరు దేవాలయానికి వచ్చి ప్రార్థన చేసి, నా భక్తిని వ్యక్తం చేస్తాను' అని రణ్‌వీర్ దాఖలు చేసిన ప్రమాణపత్రంలో ఉందని న్యాయవాదులు తెలిపారు.

## తీవ్ర ఆందోళనకు గురయ్యా
## .. 'జననాయగన్' లీక్‌పై చిరంజీవి పోస్ట్



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ నటించిన సరికొత్త చిత్రం 'జననాయగన్'. విడుదలకు ముందే ఈ చిత్రానికి సంబంధించిన పలు సన్నివేశాలు ఆన్‌లైన్‌లో లీక్ కావడంపై అగ్ర కథానాయకుడు చిరంజీవి స్పందించారు. ఈ ఘటన తనను తీవ్ర ఆందోళన గురి చేసిందన్నారు. ''జననాయగన్' చిత్రం దురదృష్టవశాత్తు లీక్ కావడం నన్నెంతో ఆందోళనకు గురి చేసింది. నమ్మకం, శ్రమ, ఎంతోమంది సమష్టి కలల సమాహారమే సినిమా. ఇలాంటి సంఘటనలు పరిశ్రమలోని మనందరినీ ప్రభావితం చేస్తాయి. మన క్రియేటివ్ వర్క్‌ని కాపాడుకోవడం ఎంత కీలకమో గుర్తు చేస్తుంటాయి. ఈ నష్టాన్ని అరికట్టడంలో, దోషులను శిక్షించడంలో మేమంతా ఏకతాటిపై కేవీఎన్ ప్రొడక్షన్స్‌కు మద్దతుగా నిలుస్తాం. సినిమాను గౌరవించి, పరిరక్షించేందుకు మనమందరం మన మద్దతును అందిద్దాం'' అని ఆయన పిలుపునిచ్చారు. హెచ్. వినోద్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'జన నాయగన్'. విజయ్ హీరోగా నటించిన ఈ చిత్రంలో పూజా హెగ్డే, మమితా బైజు, ప్రకాశ్ రాజ్ తదితరులు కీలక పాత్ర పోషించారు.

సెన్సార్ బోర్డు నుంచి ఇంకా సర్టిఫికెట్ రాకపోవడంతో జనవరి నెలలో విడుదల కావాల్సిన ఈ చిత్రం వాయిదా పడింది. మరోవైపు, ఈ సినిమాకు సంబంధించిన 5 నిమిషాల సన్నివేశంతో పాటు ఓ పాట కూడా సోషల్ మీడియాలో షేర్ అవుతోంది.

## 'రేజర్' రాక ఆ రోజే

రవిబాబు ప్రధాన పాత్రలో నటిస్తూ.. స్వయంగా తెరకెక్కించిన చిత్రం 'రేజర్'. సురేశ్ ప్రొడక్షన్స్ సమర్పణలో ఫ్లయింగ్ ఫ్రాగ్స్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. ప్రస్తుతం నిర్మాణాంతర పనుల్లో ఉన్న ఈ చిత్రాన్ని తన తండ్రి చలపతిరావు జయంతి సందర్భంగా మే 8న విడుదల చేయనున్నట్లు రవిబాబు ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను నెట్టింట పంచుకున్నారు. ఇది ఓ ఆసక్తికర కథతో యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబైందని.. దీంట్లో రవిబాబు పాత్ర ఆశ్చర్యపరిచేలా ఉండనుందని చిత్ర వర్గాలు తెలిపాయి.

# చాలా గర్వంగా ఉంది
## ... అభిమానులపై అల్లు అర్జున్ పోస్టు

తన అభిమానుల విషయంలో చాలా గర్వంగా ఉందన్నారు ప్రముఖ నటుడు అల్లు అర్జున్. హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పిస్తున్నందుకు వారిని అభినందించారు. శక్తికి మించి.. ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపడుతున్నందుకు ఆనందంగా ఉందన్నారు. వ్యాక్సినేషన్ ప్రక్రియను ముందుకు నడిపిస్తున్న మంత్రులు, నాయకులు, ప్రభుత్వ అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఏడాదికో మంచి చేయాలన్న అల్లు అర్జున్ సందేశంతో ఆయన ఫ్యాన్స్ అసోసియేషన్ ఈసారి హెచ్‌పీవీ వ్యాక్సిన్ గురించి అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. కిషోర బాలికల్లో భవిష్యత్తులో సర్వైకల్ (గర్భాశయ ముఖ ద్వార) క్యాన్సర్ రాకుండా ఇచ్చే వ్యాక్సిన్ ఇది. ఇక అల్లు అర్జున్ సినిమాల విషయానికొస్తే.. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈనెల 8న విడుదలైన 'రాకా' టైటిల్ పోస్టర్ అంచనాలు పెంచిన సంగతి తెలిసిందే. కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రమిది.



## మే నెలాఖరున 'స్వయంభు'?



కథానాయకుడు నిఖిల్.. దర్శకుడు భరత్ కృష్ణమాచారి కలయికలో రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'స్వయంభు'. భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. సంయుక్తా మేనన్, నభా నటేశ్ కథానాయికలు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా ఈ నెలలో తెరపైకి రానున్నట్లు వార్తలొచ్చినా.. అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే ఇప్పుడీ చిత్రాన్ని మే నెలాఖరున థియేటర్లలోకి తీసుకొచ్చేందుకు చిత్ర బృందం ప్రణాళిక రచిస్తున్నట్లు తెలిసింది. దీని కోసం వచ్చే నెల 23ని విడుదల తేదీగా ఖరారు చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. చారిత్రక అంశాలతో ముడిపడిన ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో నిఖిల్ ఓ యోధుడి పాత్రలో అలరించనున్నారు. ఈ సినిమాకి సంగీతం: రవి బస్రూర్, ఛాయాగ్రహణం: కె.కె.సెంథిల్ కుమార్.

## 'కొరియన్ కనకరాజు'
## ..ఫస్ట్ సింగిల్ ప్రోమో రిలీజ్

వరుణ్ తేజ్ కథానాయకుడిగా రానున్న చిత్రం 'కొరియన్ కనకరాజు'. రితికా నాయక్ కథానాయిక. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రానున్న ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ సింగిల్ ప్రోమోను టీమ్ విడుదల చేసింది. పూర్తి పాట నేడు రానుంది.



## ఇప్పుడే మొదలెట్టినట్లుంది!




''దక్షిణాది ప్రేక్షకులు నా పట్ల ఎప్పుడూ ఎంతో ప్రేమతో ఉంటున్నారు. నన్ను వాళ్ల కుటుంబంలోని వ్యక్తిలా ఆదరించారు. ఇది నాలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది'' అంటోంది తమన్నా. ఓవైపు మహిళా ప్రాధాన్య చిత్రాలు, మరోవైపు ఓటీటీ కథలు.. ప్రత్యేక పాటలు.. ఇలా ఎదురొచ్చిన అవకాశాన్ని అందుకుంటూ అభిమానుల్ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుందీమె. ఈ మధ్యే సినీరంగంలో 21ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ కార్యక్రమంలో పాల్గొన్న తమన్నా మాట్లాడుతూ.. ''ప్రస్తుతం నేను నటించిన చిత్రాలన్నీ ఒక్కొక్కటిగా విడుదల కాబోతున్నందుకు ఉత్సాహంగా ఉన్నా. చాలా మంది నటీనటులకు.. ముఖ్యంగా నటీమణులకు ఇలాంటి అవకాశం లభించదు. నా కెరీర్ మొదలై దాదాపు 21ఏళ్లు అయ్యింది. అయినా ఇప్పుడే మళ్లీ ప్రారంభిస్తున్నట్లుగా ఉంది. దక్షిణాది పరిశ్రమలో లభిస్తున్న ఆదరణ నాకు మరింత ఉత్తేజాన్ని కలిగిస్తుంది. అందుకే నేను కూడా వారిని కొత్త కథలు, ప్రయోగాత్మక చిత్రాలతో అలరించాలని భావిస్తున్నాన''ని చెప్పుకొచ్చింది.

# అడివి శేష్ రొమాంటిక్ యాక్షన్ మూవీ ఎలా ఉందంటే?
## డెకాయిట్ మూవీ రివ్యూ...

డెకాయిట్; నటీనటులు: అడివి శేష్, మృణాల్ ఠాకూర్, అనురాగ్ కశ్యప్, సునీల్, ప్రకాశ్‌రాజ్, కామాక్షి భాస్కర్ల, అతుల్ కులకర్ణి తదితరులు.. సంగీతం: భీమ్స్ సిసిరోలియో; ఛాయాగ్రహణం: ధనుష్ భాస్కర్; కథ, స్క్రీన్‌ప్లే: అడివి శేష్; దర్శకత్వం: షానియల్ డియో; నిర్మాత: సుప్రియ యార్లగడ్డ, సునీల్ నారంగ్; విడుదల తేదీ: 10-04-2026. డివి శేష్ డబుల్ హ్యాట్రిక్ విజయాలతో జోరు మీదున్నారు. పైగా 'మేజర్'తో జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్నాడు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'డెకాయిట్'పై ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ మంచి అంచనాలు ఏర్పడ్డాయి. మరి ఈ 'డెకాయిట్' కథేంటి? తను ప్రేక్షకుల మనసులు దోచుకున్నాడా? లేదా?

**కథేంటంటే..** హరిదాస్ (అడివి శేష్) ఓ హత్య కేసులో 13 ఏళ్లుగా జైలు జీవితం అనుభవిస్తుంటాడు. ఓరోజు తనని కడప జైలు నుంచి మారుస్తుండగా పోలీసుల నుంచి తప్పించుకుంటాడు. దీనికోసం ఇషాద్ భాయ్ (అతుల్ కులకర్ణి) అతనికి సాయం చేస్తాడు. హరి అలా తప్పించుకోగానే తనని దుబాయ్ పంపేందుకు అన్ని ఏర్పాట్లు చేయగా.. దానికోసం ఇంకా రూ. 60లక్షలకు పైగా డబ్బు అవసరమవుతుంది. అయితే అతను దుబాయ్‌కి వెళ్లేలోపు తనకు అవసరమైన డబ్బు సంపాదించడంతో పాటు మరో పని కూడా చేయాలనుకుంటాడు. తనని జైలు పాలయ్యేలా చేసిన తన మాజీ ప్రేయసి సరస్వతి అలియాస్ జూలియట్ (మృణాల్ ఠాకూర్)పై పగ తీర్చుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఈక్రమంలోనే ఆమెను వెతుక్కుంటూ ఇంటికెళ్లగా ఓ ఆరేళ్ల కూతురి తల్లిగా దర్శనమిస్తుంది సరస్వతి. ఆమె భర్త భాస్కర్ (వైభవ్) తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలై ఉంటాడు. తన ప్రాణాలు కాపాడాలంటే ఆమెకు రూ.1కోటి డబ్బు అవసరం. ఆమె పరిస్థితిని చూసిన హరి.. తన ఆర్థిక అవసరాన్ని అడ్డం పెట్టుకునే దెబ్బ కొట్టాలని ఓ ప్రణాళిక రచిస్తాడు. మరి అదేంటి? హరి తన జీవితంలోకి తిరిగొచ్చాక సరస్వతి జీవితం ఎన్ని మలుపులు తిరిగింది? అసలు వాళ్లిద్దరూ విడిపోవడానికి కారణమేంటి? హరిని సరస్వతి హత్య కేసులో ఎందుకు ఇరికించింది? దీనికి ఆమె భర్త భాస్కర్‌కు ఉన్న లింకేంటి? ఈ కథలో సీఐ స్వామి అలియాస్ రాంబాబు (అనురాగ్ కశ్యప్), కరుణ హాస్పిటల్స్ ఛైర్మన్ (ప్రకాశ్ రాజ్), మల్లి (కామాక్షి భాస్కర్ల) పాత్రలకు ఉన్న ప్రాధాన్యత ఏంటి? అన్నది సినిమా చూసి తెలుసుకోవాలి.

**ఎలా సాగిందంటే..** అడివి శేష్ సినిమా అనగానే ప్రేక్షకుల్లో బలమైన భరోసా కనిపిస్తుంది. తను ఓ కథ ఎంచుకున్నాడంటే తప్పకుండా అందులో ఏదో వైవిధ్యత ఉంటుందని.. థ్రిల్‌కు ఏ లోటు ఉండదని అందరి నమ్మకం. ఆయన గత ఆరు చిత్ర విజయాలు అదే నిరూపించాయి కూడా. ఇక ఈసారి 'డెకాయిట్'కి తనే స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందించాడనే సరికి దీనిపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత రెట్టింపయ్యాయి. కథ, కథనాల్లో మరీ అంత కొత్తదనమేమీ లేకపోయినా కొన్ని మెరుపులతో ఆ లోటు తెలియనీయలేదు. ఓ కులాంతర ప్రేమకథకు.. తనదైన శైలిలో ట్విస్ట్‌లు, టర్న్‌లు జోడించి ఓ మాస్ యాక్షన్ సినిమాని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు శేష్. అయితే ఇందులోని యాక్షన్ హంగామా ఆద్యంతం అలరించినప్పటికీ.. ప్రేమకథ పూర్తి స్థాయిలో ప్రభావం చూపించలేకపోయింది. కథానాయకుడు జైలు జీవితాన్ని చూపిస్తూ సినిమాని ఆరంభించిన తీరు ఫర్వాలేదనిపిస్తుంది. ఆ వెంటనే కథానాయికతో ప్రేమకథను.. వాళ్లు విడిపోవడానికి వెనకున్న కారణాల్ని చూపిస్తూ నెమ్మదిగా కథను ముందుకు తీసుకెళ్లారు. హీరో ఎప్పుడైతే జైలు నుంచి తప్పించుకుంటాడో అక్కడి నుంచి సినిమా వేగం పుంజుకుంటుంది. ఈక్రమంలో వచ్చే ట్రైన్ యాక్సిడెంట్ సీక్వెన్స్.. బ్యాగ్రౌండ్‌లో వినిపించే 'పాలపిట్టరో.. కన్నుకొట్టరో' రీమిక్స్ ప్రేక్షకులకు మంచి విజిల్ మూమెంట్. ఇక హీరో ఎప్పుడైతే కథానాయిక జీవితంలోకి తిరిగి ఎంట్రీ ఇస్తాడో అక్కడి నుంచి కథలో సంఘర్షణ మొదలవుతుంది. వాళ్లిద్దరూ కలిసి డబ్బు దోచుకునేందుకు సిద్ధమైనప్పటి నుంచి ఆ సంఘర్షణ రెట్టింపవుతుంది. ఈక్రమంలో వచ్చే విరామ సన్నివేశాలు థ్రిల్ చేస్తాయి.

ఓ వైపు నాయకానాయికల్ని వెతికి పట్టుకునేందుకు సీఐ స్వామి రంగంలోకి దిగడం.. వాళ్లని తప్పించుకుని, కథానాయికని పోలీసులకు పట్టించాలని హీరో చేసే ప్రయత్నాలతో ద్వితీయార్ధం థ్రిల్లింగ్‌గా మొదలవుతుంది. హీరోని కథానాయిక జైలు పాలయ్యేలా చేయడానికి వెనకున్న కారణం కన్విన్సింగ్‌గా చెప్పారు. కాకపోతే ఆమెకి ఉన్న ఆరోగ్య సమస్య.. దాని నుంచి





బయటపడేందుకు తనే స్వయంగా సాహసాలకు సిద్ధమవ్వడం సిల్లీగా అనిపిస్తుంది. కాకపోతే ఈ మధ్యలో వచ్చే ఛేజింగ్ సీక్వెన్స్‌లన్నీ ప్రేక్షకుల్ని కట్టిపడేసేలాగే ఉంటాయి. క్లైమాక్స్‌ని భావోద్వేగభరితంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు.

**ఎవరెలా చేశారంటే..** హరిదాస్ పాత్రలో మాసీ లుక్స్‌లో అడివి శేష్ కనిపించిన విధానం.. తన నటన.. మదనపల్లి యాసలో పలికిన సంభాషణలు అన్నీ ప్రేక్షకుల్ని అలరిస్తాయి. యాక్షన్‌తో పాటు భావోద్వేగభరిత సన్ని వేశాల్లోనూ అదరగొట్టారు. తన జూలియట్‌గా సరస్వతి పాత్రలో మృణాల్ ఒదిగిన తీరు ఆకట్టుకుంటుంది. చాలా చోట్ల కళ్లతోనే భావోద్వేగాల్ని పండించింది. సీఐ స్వామిగా అనురాగ్ కశ్యప్ స్క్రీన్ ప్రెజెన్స్ బాగుంది. ప్రకాశ్‌రాజ్, సునీల్, కామాక్షి భాస్కర్ల, అతుల్ కులకర్ణి తదితరుల పాత్రలు పరిధి మేరకు ఉంటాయి (Dacoit Movie Review) . అడివి శేష్ రాసుకున్న కథలో కొత్తదనం లేదు. స్క్రీన్‌ప్లేతో తనదైన శైలిలో అక్కడక్కడా మ్యాజిక్ చేసే ప్రయత్నం చేశారు. ఈ కథని షానియల్ తెరపై ఆవిష్కరించిన తీరు బాగుంది. యాక్షన్, ఛేజింగ్ సీక్వెన్స్‌లను ఆకట్టుకునేలా డిజైన్ చేశారు. భీమ్స్ నేపథ్య సంగీతం, పాటలు ఆకట్టుకుంటాయి. ఛాయాగ్రహణం.. నిర్మాణ విలువలు బాగున్నాయి.

**బలాలు....** అడివి శేష్, మృణాల్ నటన, ప్రథమార్ధంలోని థ్రిల్.., పాటలు, యాక్షన్ సీక్వెన్స్‌లు

**బలహీనతలు...** కొత్తదనం లేని కథ, ద్వితీయార్ధంలో కొన్ని సన్నివేశాలు, చివరిగా: 'డెకాయిట్'.. యాక్షన్‌తో మనసులు దోచేస్తాడు!

గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టికోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!



# ఆయుశ్ సంచలనం

నింగ్బో (చైనా): బరిలోకి దిగిన తొలిసారే భారత రైజింగ్ స్టార్ ఆయుశ్ శెట్టి ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. పురుషుల సింగిల్స్ విభాగంలో పోటీపడుతున్న ఈ కర్ణాటక షట్లర్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రపంచ నాలుగో ర్యాంకర్, 2024 ఆసియా చాంపియన్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)తో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 25వ ర్యాంకర్ ఆయుశ్ 23-21, 21-17తో సంచలన విజయం సాధించాడు

54 నిమిషాలపాటు జరిగిన ఈ పోరులో ఆయుశ్ నిలకడగా ఆడుతూ క్రిస్టీని కట్టిపడేశాడు. తొలి గేమ్‌లో 18-20తో వెనుకబడ్డ ఆయుశ్ సంయమనం కోల్పోకుండా ఆడి వరుసగా మూడు పాయింట్లు గెలిచి 21-20తో ముందంజ వేశాడు. ఆ తర్వాత క్రిస్టీ 21-21తో స్కోరును సమం చేయగా... ఆయుశ్ ఈసారి వరుసగా రెండు పాయింట్లు నెగ్గి గేమ్‌ను దక్కించుకున్నాడు. తొలి గేమ్‌ను సొంతం చేసుకున్న ఉత్సాహంలో ఆయుశ్ రెండో గేమ్‌లో మరింత జోరు పెంచాడు. తొలుత 5-2తో, ఆ తర్వాత 8-6తో, 14-10తో ఆధిక్యంలోకి వెళ్లాడు. క్రిస్టీ కోలుకునే ప్రయత్నం చేసినా ఆయుశ్ ఎలాంటి అవకాశాలు ఇవ్వకుండా సాధించిన ఆధిక్యాన్ని కాపాడుకొని చివరకు రెండో గేమ్‌తోపాటు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. నేడు జరిగే సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్, 2023 విశ్వవిజేత కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్)తో ఆయుశ్ తలపడతాడు.

7 ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్‌లో పతకం గెలిచిన ఏడో భారతీయ ప్లేయర్ ఆయుశ్ శెట్టి. గతంలో హెచ్‌ఎస్ ప్రణయ్ (2018లో కాంస్యం), అనూప్ శ్రీధర్ (2007లో కాంస్యం), పుల్లెల గోపీచంద్ (2000లో కాంస్యం), ప్రకాశ్ పదుకొనే (1976లో కాంస్యం), దినేశ్ ఖన్నా (1965లో స్వర్ణం, 1969లో కాంస్యం), సురేశ్ గోయల్ (1965లో కాంస్యం) ఈ ఘనత సాధించారు.

# రాజస్తాన్ రాయల్స్ వరుసగా నాలుగో విజయం



**26 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్స్‌లతో 78**
**6 వికెట్లతో ఓడిన బెంగళూరు**

**విజయలక్ష్యం ఎంతైతేనేమి... ప్రత్యర్థి ఎవరైతేనేమి... 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి లెక్కే లేదు... అతనికి తెలిసిందల్లా ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడటమే... ఐపీఎల్‌లో మరోసారి అతను తన విధ్వంసక రూపాన్ని ప్రదర్శించాడు. ఫలితంగా రాజస్తాన్ రాయల్స్‌కు వరుసగా నాలుగో విజయం దక్కగా, బెంగళూరుకు తొలి ఓటమి ఎదురైంది. 202 పరుగుల ఛేదనలో వైభవ్ 78 పరుగుల సహాయంతో 49 బంతుల్లోనే 129కి చేరిన రాజస్తాన్‌కు మిగిలిన 73 పరుగులు రాబట్టడంలో ఇబ్బంది రాలేదు. ధ్రువ్ జురేల్ కూడా అర్ధ సెంచరీతో విజయంలో కీలకపాత్ర పోషించాడు.**



గువాహటి: ఐపీఎల్‌లో మాజీ విజేత రాజస్తాన్ రాయల్స్ దూసుకుపోతోంది. శుక్రవారం దాదాపు ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో రాజస్తాన్ ఆరు వికెట్ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరును ఓడించింది. వర్షం కారణంగా మ్యాచ్ నిర్ణీత సమయంకంటే 70 నిమిషాలు ఆలస్యంగా మొదలైంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది.

కెప్టెన్ రజత్ పాటీదార్ (40 బంతుల్లో 63; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీ చేయగా, విరాట్ కోహ్లి (16 బంతుల్లో 32; 7 ఫోర్లు) కీలక పరుగులు సాధించాడు. అనంతరం రాజస్తాన్ 18 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 202 పరుగులు చేసి గెలిచింది. వైభవ్ సూర్యవంశీ (26 బంతుల్లో 78; 8 ఫోర్లు, 7 సిక్స్‌లు) చెలరేగిపోగా, ధ్రువ్ జురేల్ (43 బంతుల్లో 81 నాటౌట్; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీని నమోదు చేశాడు.

**రాణించిన కోహ్లి...**

ఆర్చర్ వేసిన ఇన్నింగ్స్ తొలి బంతికే సాల్ట్ (0) వెనుదిరిగినా.... కోహ్లి కొన్ని చక్కటి షాట్లతో అలరించాడు. ఆర్చర్ తర్వాతి ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన అతను సందీప్ ఓవర్లో మరో రెండు ఫోర్లు బాదాడు. పడిక్కల్ (14) విఫలం కాగా, చక్కటి బంతితో కోహ్లిని బౌల్డ్ చేసి బిష్ణోయ్ దెబ్బ తీశాడు. పవర్‌ప్లేలో ఆర్‌సీబీ 61 పరుగులు చేయగా, తక్కువ వ్యవధిలో కృనాల్ పాండ్యా (1), జితేశ్ శర్మ (5), టిమ్ డేవిడ్ (13) అవుటయ్యారు. షెఫర్డ్ (11 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుకు జడేజా అడ్డుకట్ట వేశాడు.

ఆఖరి 6 ఓవర్లలో 76 పరుగులు...

ఆర్‌సీబీ స్కోరు 14 ఓవర్లలో 125/7... తడబడుతూ ఆడిన కెప్టెన్ పాటీదార్ 26 బంతుల్లో 27 పరుగులే చేయగా... తప్పనిసరి స్థితిలో బ్యాటర్ వెంకటేశ్ అయ్యర్ (15 బంతుల్లో 29 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు)ను ఇంపాక్ట్ సబ్‌గా జట్టు బరిలోకి దిగింది. ఈ దశలో పాటీదార్ చెలరేగిపోయాడు. తర్వాతి 14 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో అతను 36 పరుగులు రాబట్టాడు. బర్గర్, బిష్ణోయ్ ఓవర్లలో అతను రెండేసి సిక్సర్లు బాది 35 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్నాడు. అతను అవుటైన తర్వాత వెంకటేశ్ బాధ్యత తీసుకున్నాడు. సందీప్ వేసిన చివరి ఓవర్లో వెంకటేశ్ ఫోర్, 2 సిక్స్‌లు బాదడంతో స్కోరు 200 దాటింది.

జురేల్ జోరు...

భారీ ఛేదనలో రాజస్తాన్ వేగంగా దూసుకుపోయింది. సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడిన హాజల్‌వుడ్ ఓవర్లో 2 సిక్స్‌లు బాదిన యశస్వి జైస్వాల్ (13) అదే ఓవర్లోనే వెనుదిరిగాడు. అయితే మరో ఓపెనర్ వైభవ్ తనదైన శైలిలో చెలరేగిపోగా, జురేల్ కూడా దూకుడు ప్రదర్శించాడు.

అభినందన్ ఓవర్లో జురేల్ వరుసగా 4, 6, 4, 0, 6, 4తో ఏకంగా 24 పరుగులు సాధించడంతో పవర్‌ప్లే ముగిసేసరికే స్కోరు 97కు చేరింది. ఎట్టకేలకు కృనాల్ వరుస బంతుల్లో వైభవ్, హెట్‌మైర్ (0)లను అవుట్ చేయగా, పరాగ్ (3) విఫలమయ్యాడు. ఈ దశలో రాయల్స్ కాస్త నెమ్మదించింది. వరుసగా 25 బంతుల పాటు బౌండరీనే రాలేదు. అయితే జురేల్, రవీంద్ర జడేజా (25 బంతుల్లో 24 నాటౌట్; 1 ఫోర్) సంయమనంతో ఆడి జట్టును గెలిపించారు.

మళ్లీ అదే బాదుడు...

వైభవ్ సూర్యవంశీ మరోసారి తన స్థాయిని, సత్తాను ఈ మ్యాచ్‌లోనూ ప్రదర్శించాడు. భువీ వేసిన మొదటి ఓవర్లో 2 ఫోర్లతో మొదలు పెట్టిన అతను అభినందన్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. గత మ్యాచ్‌లో బుమ్రాపై చెలరేగిన తరహాలోనే ఈసారి మరో అంతర్జాతీయ స్టార్ బౌలర్ హాజల్‌వుడ్ పని పట్టాడు. హాజల్‌వుడ్ ఓవర్లో వైభవ్ వరుసగా 4, 4, 4, 6తో చెలరేగిపోయాడు.

భువీ వేసిన తర్వాతి ఓవర్లోనూ 2 సిక్స్‌లు, ఫోర్ బాదిన అతను 15 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రాజస్తాన్‌ను నిలువరించే ప్రయత్నంలో పార్ట్‌టైమర్ డేవిడ్‌ను ఆర్‌సీబీ బౌలింగ్‌కు దింపగా, వైభవ్ వరుసగా రెండు సిక్సర్లతో దాడి చేశాడు.



**స్కోరు వివరాలు**

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (సి) జురేల్ (బి) ఆర్చర్ 0; కోహ్లి (బి) బిష్ణోయ్ 32; పడిక్కల్ (సి) హెట్‌మైర్ (బి) ఆర్చర్ 14; పాటీదార్ (సి) ఫెరీరా (బి) సందీప్ 63; కృనాల్ (సి) హెట్‌మైర్ (బి) బిష్ణోయ్ 1; జితేశ్ (ఎల్బీ) (బి) బ్రిజేశ్ 5; డేవిడ్ (సి) హెట్‌మైర్ (బి) బ్రిజేశ్ 13; షెఫర్డ్ (సి) బ్రిజేశ్ (బి) జడేజా 22; వెంకటేశ్ (నాటౌట్) 29; భువనేశ్వర్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 13; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 201. వికెట్ల పతనం: 1-0, 2-45, 3-58, 4-62, 5-76, 6-94, 7-125, 8-166. బౌలింగ్: ఆర్చర్ 3-0-33-2, బర్గర్ 3-0-32-0, సందీప్ 4-0-47-1, రవి బిష్ణోయ్ 4-0-32-2, జడేజా 2-0-14-1, బ్రిజేశ్ 4-0-37-2.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) జితేశ్ (బి) హాజల్‌వుడ్ 13; వైభవ్ (సి) కోహ్లి (బి) కృనాల్ 78; జురేల్ (నాటౌట్) 81; హెట్‌మైర్ (సి) హాజల్‌వుడ్ (బి) కృనాల్ 0; పరాగ్ (సి) కృనాల్ (బి) హాజల్‌వుడ్ 3; జడేజా (నాటౌట్) 24 ; ఎక్స్‌ట్రాలు 3; మొత్తం (18 ఓవర్లలో 4 వికెట్లకు) 202. వికెట్ల పతనం: 1-21, 2-129, 3-129, 4-134. బౌలింగ్: భువనేశ్వర్ 4-0-37-0, హాజల్‌వుడ్ 4-0-44-2, అభినందన్ 3-0-54-0, కృనాల్ పాండ్యా 4-0-30-2, డేవిడ్ 1-0-18-0, షెఫర్డ్ 2-0-18-0.

**ఐపీఎల్‌లో నేడు**

**పంజాబ్ X హైదరాబాద్**
**వేదిక: న్యూ చండీగఢ్**
**మధ్యాహ్నం గం. 3:30 నుంచి**
**చెన్నై X ఢిల్లీ**
**వేదిక: చెన్నై**
**రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం**

# ఓపిక పట్టాలి!



**భారత సీనియర్ జట్టులో వైభవ్ సూర్యవంశీకి చోటుపై అభిమానులకు కుంబ్లే సూచన**

ముంబై: ఐపీఎల్‌లో మెరుపులతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న వైభవ్ సూర్యవంశీపై మరింత ఒత్తిడి పెంచడం సరికాదని టీమిండియా మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే అన్నాడు. 15 ఏళ్ల కుర్రాడిని అలా అతడి ఇష్టానికి వదిలేయాలని ఇప్పటి నుంచే అతడి మనసులో జాతీయ సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించే ఒత్తిడిని నింపొద్దని ఈ స్పిన్ దిగ్గజం హితవు పలికాడు. 'మాస్టర్ బ్లాస్టర్' సచిన్ టెండూల్కర్ కూడా టీనేజ్ వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టి... ఆ తర్వాత బ్యాటింగ్ లెజెండ్‌గా ఎదగగా... ఇప్పుడు ఆ అవకాశం సూర్యవంశీకి ఉందని పలువురు విశ్లేషిస్తున్న నేపథ్యంలో కుంబ్లే వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

'అసాధారణ ప్రతిభ గల వైభవ్ సూర్యవంశీ దూకుడును ఆపడం కష్టతరమే. అయితే తొందరపాటు అంచనాలు యువ క్రీడాకారుడిపై అనవసర ఒత్తిడి పెంచుతాయి. ఈ వయసులోనే అతడు చక్కగా ఆడుతున్నాడు. అయితే మరో రెండు నెలల్లో నువ్వు టీమిండియాకు ఆడాలి అని చెప్పడం మాత్రం అతడిపై కచ్చితంగా ఒత్తిడి పెంచుతుంది. మరో పదేళ్ల తర్వాత కూడా వైభవ్ వయసు ఇంకా పాతికేళ్లే ఉంటుంది' అని కుంబ్లే అన్నాడు.

క్రికెట్‌లో విజయవంతం కావడానికి ఒక నిర్దిష్టమైన మార్గం అంటూ ఏదీ లేదని... నిరంతరం శ్రమిస్తూ ఎప్పటికప్పుడు మెరుగవుతూ ముందుకు సాగితే ఫలితాలు అనుకూలంగా వస్తాయని కుంబ్లే పేర్కొన్నాడు. 'ఈ ఏడాదో, వచ్చే ఏడాదో అతడి పేరు సెలెక్టర్ల పరిశీలనకు రావడం ఖాయం. ఇప్పటికే అతడి ఆటతీరును అంతా నిశితంగా పరిశీలిస్తున్నారు. కాస్త ఓపిక పట్టడం ముఖ్యం' అని వివరించాడు.

క్రీడా సంస్కృతి పెరగాలి...

భారత్‌కు ఒలింపిక్స్ ఆతిథ్యమిచ్చే అవకాశం దక్కితే అది దేశ క్రీడారంగంలో కీలక మలుపుగా నిలుస్తుందని కుంబ్లే అన్నాడు. మౌలిక వసతులు పెంపొందడంతో పాటు... కొత్త తరం అథ్లెట్లకు స్ఫూర్తినిస్తుందని అభిప్రాయపడ్డారు. 'భారీ క్రీడా పోటీలతో పరిస్థితుల్లో మార్పు వస్తుంది. 1982లో జరిగిన ఆసియా క్రీడలు నాపై చాలా ప్రభావం చూపాయి. దీంతో దేశంలో క్రీడా సంస్కృతి పెంపొందుతుంది' అని కుంబ్లే అన్నాడు. ఏదో ఒక రోజు భారత ఫుట్‌బాల్ జట్టు కూడా ఫిఫా ప్రపంచకప్‌లో పాల్గొంటుందని జంబో ఆశాభావం వ్యక్తం చేశాడు.

# 2 ఓవర్లలో 28 పరుగులు.. పాతిక కోట్ల ప్లేయర్‌పై ట్రోలింగ్

భారీ అంచనాలు పెట్టుకొని మినీ వేలంలో రూ.25.20 కోట్లకు కామెరూన్ గ్రీన్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ కొనుగోలు చేసింది. కానీ, ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లోనూ అతడు పెద్దగా ప్రభావం చూపలేదు. నాలుగు మ్యాచుల్లో ఒకటి వర్షం కారణంగా రద్దు కాగా.. మిగతా మూడింట్లో అతడి స్థాయికి తగ్గ ప్రదర్శన మాత్రం చేయలేకపోయాడు. తాజాగా లఖ్‌నవూతో జరిగిన మ్యాచ్‌లో 2 ఓవర్లు వేసి ఒక్క వికెట్ మాత్రమే పడగొట్టి 28 పరుగులు ఇవ్వడంపై కేకేఆర్ అభిమానులు అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, కేవలం రూ.2.60 కోట్ల ఆటగాడు ముకుల్ చౌదరి తన జట్టు లఖ్‌నవూను గెలిపించాడు. దీంతో సోషల్ మీడియాలో గ్రీన్‌పై ట్రోలింగ్ మొదలైంది. అతడిలో పదో వంతు మాత్రమే విలువ చేసే ప్లేయర్ ఆటను చూసైనా నేర్చుకోవాలంటూ కామెంట్లు పెడుతున్నారు. ఇలాగైతే, కేకేఆర్‌తో ఎక్కువ రోజులు ఉండలేవంటూ ఎద్దేవా చేశారు.

"కామెరూన్ గ్రీన్ విలువ రూ.25.20 కోట్లు. ఈ సీజన్‌లో 2 ఓవర్లు వేశాడు. 28 పరుగులు ఇచ్చాడు. అంటే 14 ఎకానమీతో బౌలింగ్ చేశాడు"

"ఇదే ధరపై కామెరూన్ గ్రీన్‌ను కేకేఆర్ తరఫున చూడలేకపోవచ్చు. ఈ అద్భుతమైన స్టార్ ఆల్‌రౌండర్‌కు కెప్టెన్ అజింక్య రహానె 19వ ఓవర్‌ను ఇవ్వడం మరీ విడ్డూరం"

"కేవలం రూ.2.60 కోట్లతో లఖ్‌నవూ యజమాని సంజీవ్ గోయెంకా అద్భుతమైన ప్లేయర్‌ను తీసుకున్నారు. మరోవైపు, షారుక్ ఖాన్ మాత్రం పాతిక కోట్లు వెచ్చించి మరీ గ్రీన్‌ను తీసుకున్నాడు. అతడికి బదులు భారత్ నుంచే పది మంది నాణ్యమైన క్రికెటర్లను తీసుకొనే అవకాశం ఉంది. ఇకనైనా, ఐపీఎల్ ఫ్రాంచైజీ ఓనర్లు తెలివిగా నిర్ణయాలు తీసుకోవాలి. విదేశీ క్రికెటర్లు కేవలం డబ్బు కోసమే వస్తున్నారు. ప్రదర్శన ఏమాత్రం బాగోలేదు"

# నాన్న త్యాగం...ధోనిపై అభిమానం

**ఆసక్తికరం ముకుల్ చౌదరీ క్రికెట్ ప్రస్థానం**
**రోజూ 100–150 సిక్సర్ల సాధన**



లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్ ముకుల్ చౌదరీ గురువారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో మ్యాచ్‌లో ఏడు సిక్సర్లతో మోత మోగించి తన జట్టును గెలిపించాడు. అయితే ఈ ఏడింటిలో తాను కొట్టిన మొదటి సిక్సర్ అన్నింటికంటే ఎక్కువగా నచ్చిందని ముకుల్ మ్యాచ్ తర్వాత చెప్పాడు. వైభవ్ అరోరా వేసిన 17వ ఓవర్‌లో ఈ సిక్స్ వచ్చింది. అరోరా వేసిన యార్కర్‌ను హెలికాప్టర్ షాట్‌తో లాంగాన్ మీదుగా సిక్స్ బాదిన ముకుల్ తాను ఆరాధించే ధోనిని గుర్తుకు తెచ్చాడు. ధోనిపై ఇష్టంతో క్రికెట్‌లోకి వచ్చిన ముకుల్ ఇప్పుడు ఒక్క ఐపీఎల్ మ్యాచ్‌తో స్టార్‌గా మారిపోయాడు

రాజస్తాన్‌కు చెందిన ముకుల్ ఐపీఎల్‌లో తన తొలి సీజన్ ఆడుతున్నాడు. మొదటి మ్యాచ్‌లో 14 పరుగులకే పరిమితమైన అతను రెండో మ్యాచ్‌లో 2 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో ఆడిన ఐదు బంతుల్లోనూ అతను కాస్త తడబడ్డాడు. అయితే ఎక్కువగా ఆందోళన చెందవద్దని, నచ్చినట్లుగా ఆడమని కెప్టెన్ రిషభ్ పంత్ ధైర్యాన్నందించాడు. దాంతో కోల్‌కతాతో మ్యాచ్‌కు ముందు తనలో ఆత్మవిశ్వాసం పెరిగిందని ముకుల్ అన్నాడు.

'ఐదు మ్యాచ్‌లు ఆడినా 50 మ్యాచ్‌లు ఆడినా ఎవరిపైనైనా ఒత్తిడి సహజం. అందులోనూ నేను తొలిసారి ఐపీఎల్‌లో ఆడుతున్నాను. కాబట్టి జట్టు మనపై నమ్మకం ఉంచినప్పుడు ప్రాక్టీస్ మ్యాచ్‌లలో కూడా ఒత్తిడి ఉంటుంది. దేశవాళీ క్రికెట్‌లో కూడా మంచి ప్రదర్శన తర్వాతే ఇక్కడి వరకు వచ్చాం. అయితే ఇక్కడ బాగా ఆడినప్పుడు వచ్చే గుర్తింపు, పేరు ఎంతో భిన్నం. బయటి అంశాల గురించి పట్టించుకోకుండా మనపై మనం నమ్మకం ఉంచి ఆడటం ముఖ్యం' అని ముకుల్ వ్యాఖ్యానించాడు.

ఆ షాట్ అంటే ఇష్టం...

అరోరా బౌలింగ్‌లో ముకుల్ కొట్టిన హెలికాప్టర్ షాట్‌పై అన్ని వైపుల నుంచి నుంచి ప్రశంసలు కురిశాయి. 'మొదటి నుంచి నేను ధోనికి వీరాభిమానిని. వికెట్ కీపర్ అయిన నేను ధోనిలాగే ఏడో స్థానంలో ఆడుతున్నా. ఆయన మ్యాచ్‌లను ముగించే తీరు నాకు చాలా ఇష్టం. నా చిన్నప్పటి నుంచే హెలికాప్టర్ షాట్‌ను ఎంతో ప్రాక్టీస్ చేశాను. ఆ షాట్ నాకు చాలా నచ్చేది. యార్కర్‌ను ధోని సిక్సర్‌గా మలిచేవాడు. అలాంటి బంతిని సిక్స్ కొట్టడం అంటే బౌలర్‌పై మన ఆధిపత్యం ఏమిటో తెలుస్తుంది. భారీ షాట్‌లు కొట్టే విధంగా బలమైన శరీర నిర్మాణం నాకుంది. నేను సాధన కూడా చాలా చేస్తాను. ప్రతీ రోజూ దాదాపు 100-150 సిక్సర్లు ప్రాక్టీస్ చేస్తా. గత ఐదారు నెలలుగా ఇదే తరహాలో ఆడటం ఇప్పుడు ఫలితం చూపించింది' అని 21 ఏళ్ల ముకుల్ వివరించాడు.

దేశవాళీలో చెలరేగి...

నాలుగు నెలల క్రితం సరిగ్గా ఇదే తరహా ఆటతో ముకుల్ ఐపీఎల్ ఫ్రాంచైజీలో దృష్టిలో పడ్డాడు. దేశవాళీ టి20 టోర్నీ ముస్తాక్ అలీ ట్రోఫీలో అప్పటికే సత్తా చాటిన ముకుల్ ఢిల్లీతో జరిగిన పోరులో మరింతగా చెలరేగాడు. ఐపీఎల్‌లో గురువారం కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లాగానే రాజస్తాన్ 176 పరుగుల లక్ష్యాన్ని సరిగ్గా 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

ముకుల్ 26 బంతుల్లో 1 ఫోర్, 7 సిక్సర్లతో అజేయంగా 62 పరుగులు చేసి చివరి బంతికి సిక్స్‌తో జట్టును గెలిపించాడు. ఆయుశ్ బదోని వేసిన ఆఖరి ఓవర్లో విజయానికి కావాల్సిన 25 పరుగులను అతను రాబట్టడం విశేషం. ఈ ఇన్నింగ్స్ తర్వాతే వేలంలో లక్నో రూ.2 కోట్ల 60 లక్షలకు తీసుకుంది. గతంలో ఈ ఫీట్ నమోదు చేసిన కారణంగానే తనపై తనకు నమ్మకం ఉందని, ఇప్పుడు దానిని పునరావృతం చేశానని అతను చెప్పాడు.

లాంగర్ ప్రోత్సాహంతో...

ఐపీఎల్‌లో లక్నో జట్టుకు ఎంపికైన తర్వాత టీమ్ హెడ్ కోచ్ జస్టిన్ లాంగర్ ఈ కుర్రాడిపై ప్రత్యేక శ్రద్ధ చూపించాడు. తన బ్యాటింగ్‌పై నమ్మకంతో పాటు భారీ సిక్స్‌లు కొట్టగల సామర్థ్యం కోచ్‌ను ఆకట్టుకున్నాయి. రాబోయే కొన్ని రోజుల్లో 'అత్యంత ప్రమాదకర' మిడిలార్డర్ బ్యాటర్‌గా ముకుల్‌ను తీర్చిదిద్దుతానని చెప్పి కోచ్ ప్రోత్సాహాన్నందించాడు. 'అంత పెద్ద కోచ్ నా గురించి ఇలా మాట్లాడాడంటే నాలో ఏదో ప్రత్యేకత ఆయనకు కనిపించి ఉండవచ్చు. ప్రతీ రోజూ 15 నిమిషాల పాటు నా కోసం ప్రత్యేకంగా కేటాయించి సాధన చేయించడమే కాకుండా నేను ఆడాల్సిన ఆట శైలి గురించి వివరించేవారు.

ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా చెలరేగాలని నేనూ గట్టిగా కోరుకున్నా. ఇప్పుడు నా ఆటను చూపించాను' అని ముకుల్ వెల్లడించాడు. రెండేళ్ల క్రితం బ్యాటింగ్ చేసేటప్పుడు చాలా తొందరపాటు ప్రదర్శించే వాడినని... అయితే సాధన తర్వాత చివరి వరకు నిలబడి మ్యాచ్‌ను గెలిపించాలనే పట్టుదల తనలో పెరిగిందని ముకుల్ గుర్తు చేసుకున్నాడు. కోల్‌కతాతో పోరులో బౌలర్ ఏదో ఒక దశలో తప్పు చేస్తాడనే నమ్మకంతోనే వేచి చూశానని చెప్పాడు. తన ఈ ప్రదర్శనను తండ్రికి అంకితం ఇస్తున్నట్లు అతను చెప్పాడు.

కుటుంబ త్యాగాలతో...

ముకుల్ తండ్రి దలీప్‌కు క్రికెట్ అంటే చాలా ఇష్టం. ఆయన తన పెళ్లి కూడా కాకముందే కొడుకు పుడితే క్రికెటర్‌ను చేయాలని నిర్ణయించుకున్నాడు. ముకుల్‌ను 10 ఏళ్ల వయసులో క్రికెట్‌లోకి తీసుకొచ్చిన సమయంలో తండ్రి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. కొడుకు శిక్షణలో అండగా నిలిచేందుకు ముందుగా ఆయన తన ఉద్యోగాన్ని వదిలేశాడు. తనకు వాటాగా వచ్చిన ఇంటిని అమ్మేసి ముకుల్ శిక్షణ కోసం వెచ్చించాడు. రాజస్తాన్‌లోని స్వస్థలం ఝున్‌ఝునులో సరైన సౌకర్యాలు లేకపోవడంతో జైపూర్‌లోని ఆరావళి అకాడమీలో చేర్పించాడు. ఆరంభంలో మీడియం పేసర్‌గా మొదలు పెట్టినా... అకాడమీలో వికెట్ కీపర్లు ఎవరూ లేకపోవడంతో అవకాశాల కోసం అటువైపు మళ్లాడు. అయితే భారీ షాట్లు ఆడే ముకుల్ శైలిని గుర్తించిన కోచ్‌లు ఆ దిశగా బ్యాటింగ్‌లో ప్రోత్సహించారు. ఆరంభంలో సరైన అవకాశాలు రాకపోయినా ఆ తర్వాత అతని ఆట పదునెక్కింది. బీసీసీఐ అండర్-23 టోర్నీలో రాజస్తాన్ తరఫున అద్భుత ప్రదర్శన చేసిన తర్వాత ఎలాంటి అడ్డంకులు లేకుండా కెరీర్ దూసుకుపోయింది. టి20ల్లో మారిన పవర్ హిట్టింగ్‌ను మరింత సాధన చేసేందుకు వీలుగా మధ్యలో కొన్ని నెలల పాటు అతను ఢిల్లీలోని గుర్గావ్‌లో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నాడు. అతని కఠోర శ్రమ, పట్టుదల ఇప్పుడు ఐపీఎల్‌లో ఫలితం చూపించింది.